# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా
ఫోన్ (0863) 2293645, 2293862, 2293206.
web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము
డి.జె. బాలకృష్ణ లాల్
మిస్. పి. ఇందిరాదేవి
డా॥ యమ్. స్వర్ణముఖి

సంపుటి 37 సంచిక 9
పేజీలు 44
మే 2018

5సం॥ల చందా రూ. 250
2సం॥ల చందా రూ. 120
సంవత్సర చందా రూ. 60
విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్ట్ Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ , A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు
గుంటూరు జిల్లా

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL

**ఈ సంచికలో ............................. ....... పేజీ**

భద్రవాక్యం ....................................................4
శ్రీబాబూజీ ఉవాచ.......................................... 6
అమ్మమాట.................................................... 9
మాలదాసరి ................................................11
జీవబ్రహ్మైక్య అనుసంధానం ........................13
త్రిపురా రహస్యం ......................................... 16
జీవన అనుభవం ............ ..... .................. ....18
మానవ జన్మ ఉత్కృష్టత ................... ..............19
జ్ఞానికి సుఖదుఃఖాలు వుంటాయా?23
సాక్షి ............................................................24
వార్తా లహరి ..................................................25
యోగవాశిష్ఠము .......................................... 26
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు.............................28
పరిప్రశ్న ........................................................ ..29
శ్రీకృష్ణ కర్ణామృతము .......................................32
పల్లమెరుగని నీరు ...........................................33
జెన్ స్టోరీ ... .... ...... .........................................34
కైవల్యోపనిషత్ ... ..............................................36
సమర్థ సద్గురునాథుని దివ్యచరిత్ర.....39
విష్ణు కథలు ....... ............................ ...................41

# భద్ర వాక్యం

- పరాశర ప్రసాద్

**అపాణిపాదో మచింత్య శక్తిః పశ్యామచక్షుః సశృణోమ్యకర్ణః।**
**అహం విజానామి వివిక్తరూపో నచాస్తి వేత్తా మమచిత్సదాహమ్॥**

(కైవల్యోపనిషత్ 21 శ్లో॥)

గురుమూర్తి తమను ఆశ్రయించిన శిష్యులను బాహ్య విషయ ప్రపంచం నుండి మరల్చి అంతరాంతరాలలో వున్న బుద్ధి స్థానానికి తమ బోధల ద్వారా చేరుస్తారు. అయితే మనస్సు, బుద్ధిలోని భావాలు కూడా చైతన్యం ప్రకాశం చేసే విషయ ప్రపంచానికి సంబంధించినవే అయి వుంటాయి. అందువలన పరమవేత్త, శుద్ధ చైతన్యము అయిన 'నేను'ను గుర్తించగల వారులేరు. నేను అన్నింటిని తెలుసుకోగలను. కాని నన్ను తెలుసుకోగల జ్ఞానమేదీ లేదు.

స్వప్నం నుండి మేల్కొనగానే నేను నా పడక మీదనే వున్నానని, నేను ఏ దూర తీరాలకు వెళ్ళలేదని, స్వప్నంలో అనుభవించిన వింత విషయాలన్నీ మనస్సులోని భ్రమలేనని చిత్ స్వరూపుడను అయిన నేను తెలుసుకోవటం అతి సహజమైనదే. ఆత్మవస్తువు మనస్సుకి, బుద్ధికి అతీతమైనది, రూపములేని వస్తువును జ్ఞానేంద్రియాలు గుర్తించవు. అందువలన జ్ఞానస్వరూపమైన ఆత్మ వస్తువును 'వివిక్త రూపః' అంటే దాని స్వరూపమును గుర్తించేవారు లేరని అర్థము. అది జ్ఞానేంద్రియాల చేత, కర్మేంద్రియాల చేత పరిమితము కానిదైనదన్నమాట.

ఆత్మవస్తువుకు పాణి, పాదములు లేవు అంటే వాచ్యార్థాన్ని తీసుకో కూడదు. పాణి పాదములు దేహంలోని కర్మేంద్రియాలకు ప్రతీక. కాబట్టి వీటి ద్వారా విషయ ప్రపంచంలో కర్మలు కొనసాగుతున్నాయి. ఆత్మశక్తి జగత్తులోని సర్వజీవులకు ఆధారమై వాటి మనుగడకి కారణమై వుండి, ఆ శక్తిని అంచనా వేయగలిగిన వారెవరైనా వున్నారా?

ఉదాహరణకి విద్యుచ్ఛక్తి అగోచరమైనది. కానీ ఎన్నో విద్యుత్ పరికరాలను, యంత్రాలను నడిపించగల శక్తిగలదన్న విషయం అందరికీ తెలిసినదే కదా! ఆత్మవస్తువు బాహ్య ప్రపంచంలో చేయవలసిన కార్యాలేవీ లేవు. కాని సృష్టిలో జీవుల కార్యాకార్యాలకు ఆధారమై వున్నది.

ప్రాపంచికంగా ప్రాణశక్తిలాంటి నిరుపాధికమైన, నిర్విషయమైన, పరిశుద్ధమైన అనేక శక్తులు వున్నప్పటికీ అవి ఒక కార్యరూపంలో వ్యక్తమై

నప్పుడే వాటిని గుర్తించగలుగుతున్నాము. అలాగే ఆత్మశక్తి విశ్వంలోని సమస్త జీవరాసులలో వ్యాప్తమై, అది క్రియా రూపంగా వ్యక్తమైనప్పుడు మాత్రమే దానిని మనం గుర్తించగలుగుతున్నాము. మనో బుద్ధుల ఆలోచనలకు, మేధస్సుకు కూడా ఆధారమైనది ఆ శక్తి మాత్రమే. అందువలనే ఆత్మ శక్తిని 'అచింత్యశక్తి' అన్నారు. అంటే అది చింతింప అలవికానిది. చింతనకి, భావనకి అందేదికాదు. అది కేవలం అనుభవించేదే.

ఆత్మవస్తువు 'పశ్యామి అచక్షుః' కన్నులు లేకుండా చూస్తున్నాను అంటోంది. 'శృణోమి అకర్ణః' అంటే చెవులు లేకుండా వింటున్నాను అంటోంది. జ్ఞానేంద్రియాలు కేవలం గోళకాలు. వాటి ద్వారా దృశ్యాలను చూడటం, గుర్తించటం, శబ్దాలను వినటం, గ్రహించటం లాంటి క్రియలను మనస్సు చైతన్యమనే ఆత్మశక్తి ద్వారా గుర్తించగలుగుతోంది. కన్నులు, చెవులు కేవలము కరణములు. ఉదాహరణకు మరణించిన వ్యక్తికి కూడా అవే కరణములు వున్నప్పటికీ అవి నిరుపయోగమైనవి. క్రియకు తోడ్పడలేవు. ఈ విషయాన్ని జాగ్రత్తగా పరిశీలించిన సాధకుడు ఆత్మశక్తి యొక్క విశిష్ఠతను గుర్తించగలడు.



30-3-18 నుండి 3-4-18 వరకు జరిగిన శుకబ్రహ్మాశ్రమము, శ్రీకాళహస్తిలో శ్రీ విద్యాప్రకాశానంద స్వామివారి ఆరాధన కార్యక్రమంలో పాల్గొన శ్రీ మాతాజీ

# శ్రీబాబూజీ ఉవాచ - పరాశర ప్రసాద్

28-12-1979

శ్రీబాబు ఉదయం తరచుగా వ్యాహ్యాళికి వచ్చేవారు. వారివెంట మేమంతా వెళ్ళేవాళ్ళము. ఆయన రాకకోసం ఎదురుచూసేవాళ్ళం. తరచుగా తోటలో కూర్చునేవాళ్ళం. ఆయన బోధ చేసేవారు. కొన్ని సందర్భాలలో కొన్ని ప్రశ్నలు వేసేవారు.



ఆరోజు మమ్మల్ని 'బ్రహ్మచర్యమంటే ఏమిటి?' అని ప్రశ్నించారు. మా మనస్సులో ఉండే సందేహం నివృత్తి కోసము మమ్మల్ని ప్రశ్నించేవారు. ఆయన బోధ రూపంలో ఆ సందేహాన్ని నివృత్తి చేసేవారు. బాబు అడిగిన ప్రశ్నకు ఎవరూ సంతృప్తికరమైన సమాధానం చెప్పలేక పోయారు. బ్రహ్మచర్యము అంటే బ్రహ్మయందు మనస్సు చరించుట అని మాత్రము గ్రంథపఠనానుభవము వున్నవారు చెప్పగలిగారు.

"అంతవరకూ కరక్టే. నేనూ ఒప్పుకుంటాను కాని దానిని అనుభవపూర్వకంగా నిరూపించగలరా?" అని శ్రీ బాబు ప్రశ్నించినప్పుడు మాత్రం సమాధానంలేదు. శ్రీ బాబు కల్పించుకొని "పక్వస్థితికి వచ్చిన ఫలము చెట్టుకు అంటిపెట్టుకు వున్నప్పటికీ, చెట్టునుంచి సులభంగా విడదీయగల స్థితిలో ఉంటుంది. అదే పచ్చికాయ అయితే పులుపు, పచ్చితనము అనే గుణాలతో ఉండి చెట్టుకు అంటిపెట్టుకుని విడదీయరానిదిగా ఉంటుంది. మహాత్ములు అహంకార మమకారాల్ని జయించినవారు కాబట్టి అన్యదృష్టి ఉండదు. వారికి దేహదృష్టి ఉండదు. దేహముపై వ్యామోహము ఉండదు. చావు అంటే భయము ఉండదు. వారు దేహాన్ని, కావలసినపుడు పరిత్యాగము చేస్తారు. వారి దేహము త్యజించేవరకూ అది నిర్వహించవలసిన విధులు నిర్వహిస్తుంది. వారి దేహము ఇంద్రియ భోగాలను ఆశించదు. ఆత్మానందాన్నే కోరుకుంటుంది.

మీకొక దృష్టాంతము చెప్తాను. వ్యాసభగవానుడు భార్య మృతి

చెందినపుడు అమితదుఃఖముతో బాధపడుతుంటే ఆయన పుత్రుడు మహాయోగి అయిన శుకుడు తన తండ్రిని ఓదార్చి ఆయనను దుఃఖ విముక్తుడిని చేస్తాడు. శుకుడు తండ్రిని ఓదార్చుతూ 'నాన్నగారూ! అమ్మ చనిపోలేదు దుఃఖించకండి. ఆవిడ భౌతికకాయాన్ని మాత్రమే వదిలి ఘటాకాశము మహాకాశములో కలిసినట్లు పరమాత్మలో ఐక్యమైనది' అని చెప్పి దానిని తండ్రిగారికి ఋజువు చేస్తాడు.

'అమ్మా!' అని కేకవేసేసరికి అక్కడ ఉన్న చెట్లలో, జలాశయాల్లో జంతువుల్లో ఒకటేమిటి సమస్త ప్రకృతిలో అమ్మని సందర్శించి తండ్రిని సందర్శింపజేస్తాడు. ఇది కేవలం వ్యాసభగవానుడు తన కుమారుని స్థితిని అందరికి తెలియజేయటానికి చేసిన ట్రిక్ మాత్రమే.

మహాత్ములంతా ఈ కోవకి చెందినవారే. వారి మనస్సు సదా పరమాత్మపై లగ్నమై ఉంటుంది. వారు భౌతికకాయం వదిలేవరకు, మనస్సుకి సంబంధం లేకుండా శరీర విధులు నిర్వహిస్తూ ఉంటారు. అదే నిజమైన బ్రహ్మచర్యము. శ్రీ రామచంద్రుడు యజ్ఞము పూర్తియైన పిమ్మట దానిని సక్రమంగా నిర్వహించిన వసిష్ఠులవారిని మహర్షియని, అస్ఖలిత బ్రహ్మచారి అని ప్రశంసించాడు. ఇది విన్న శ్రీ అరుంధతీదేవి, తన భర్త వివాహితుడు, నూరుమంది సంతానము కల్గిఉండీ, ఏ రకంగా ఆయన అస్ఖలిత బ్రహ్మచారి అయ్యాడా! అని ఆశ్చర్యపోయి పతిపాదసేవలో నిమగ్నమై సరిఅయిన సమయం చూసి భర్తని ప్రశ్నించింది. స్వామీ మీరు అస్ఖలిత బ్రహ్మచారులని శ్రీరామచంద్రుడు కొనియాడాడు కదా! అది ఎలా వాస్తవమవుతుంది? లేక నేను వినటం లోపమా? అది విన్న వసిష్ఠ మహాముని తనలో తాను నవ్వుకొని 'సమయం వచ్చినప్పుడు ఆ విషయము నీకే తెలుస్తుందిలే' అని చెప్పారు.

కొంతకాలం గడిచిన తర్వాత అరుంధతీదేవి తాను భర్తని ప్రశ్నించిన విషయము మరచిపోయింది. వసిష్ఠ మహాముని ఇదే తగిన సమయమని భావించి, అరుంధతిని పిలిచి, తాను యజ్ఞాన్ని నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

అయితే యజ్ఞము నిమిత్తము సమీపంలోనున్న నదీజలాన్ని చిన్న పాత్రలో తీసుకొని తలపై నుంచుకొని, యజ్ఞక్షేత్రము చుట్టూ ప్రదక్షిణ చేయమని చెప్పారు. "యజ్ఞము పూర్తయి తిరిగి నేను హెచ్చరిక చేసేవరకు ఈ విధంగా ప్రదక్షిణలు చేస్తూనే ఉండాలి. నీరు ఏమాత్రం ఒక్క చుక్క కూడ పడటానికి వీలులేదు. ఏమాత్రం పొరపాటు జరిగినా

యజ్ఞఫలము దక్కదు" అని చెప్పారు.

ఆయన ఆజ్ఞ మేరకు అరుంధతీదేవి నదీ జలాన్ని పాత్రలో తీసుకొని యజ్ఞక్షేత్రము చుట్టూ ఏకాగ్రతతో ప్రదక్షిణ చేసే సమయంలో, వసిష్ఠులవారు పిల్లల్ని పిలిచి 'అమ్మకి పిచ్చి ఎక్కింది. నేను యజ్ఞము చేయాలంటే అమ్మకి పిచ్చి తక్షణం తగ్గే ప్రయత్నం చేయాలి. దానికి మీరంతా గాజు పెంకులు తీసుకొని, అమ్మ శరీరంపై ఆ గాజుపెంకులతో గాట్లు పెట్టండి' అని ఆజ్ఞాపించారు.

తండ్రి ఆజ్ఞ పాలన చేశారు వారంతా. తత్ఫలితంగా ఆవిడ శరీరం నుండి రక్తము స్రవించి యజ్ఞక్షేత్రం అంతా తడిసిపోయింది. అలా ఎంతోసేపైనా శ్రీ అరుంధతిదేవి ఏకాగ్రత మాత్రం భంగంకాలేదు. చివరకు వసిష్ఠులవారు అరుంధతిపై నీరు చల్లి యజ్ఞకార్యము పూర్తి అయినది. నీవు ఇంక ప్రదక్షిణలు ఆపవచ్చు అని హెచ్చరిక చేశారు. అప్పుడు ఆవిడ తన దేహముపైనున్న గాయాలు, యజ్ఞక్షేత్రమంతా వ్యాపించియున్న రక్తమును చూసి ఆశ్చర్యపడింది.

అప్పుడు వసిష్ఠులవారు అరుంధతీదేవితో తానేవిధంగా ఏకాగ్రతతో యజ్ఞక్షేత్రం చుట్టూ ప్రదక్షణలు చేస్తూ తన శరీర బాధను పొందలేదో, తానుకూడా అదేవిధంగా తన నిష్కళంకమైన మనస్సును సదా పరమాత్మపై లగ్నము చేసి శరీర విధులు నిర్వహిస్తున్నాని చెప్పారు.

"మనస్సు బ్రహ్మములో లయించినపుడు శరీరము సంసారయాత్ర చేసి సంతానము పొందినప్పటికి, అది బ్రహ్మచర్యమే అవుతుంద"ని శ్రీ బాబు వివరించారు.

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, ఆశ్రమ స్థిర నివాసులు అయిన శ్రీ మావులేటి నారాయణరాజు (పండుబాబు)గారు 29-3-2018 గురువారం నాడు శ్రీ సద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 76 సంవత్సరాలు. సద్గురు దేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# అమ్మమాట

- జపమాల ప్రసాద

'సూచన మంత్రం'

మనం ఈ అ, ఉ, మ అనే అక్షరాలను కొంచెం మార్చి ఉ, మ, అ అన్నామంటే 'ఉమా' అవుతుంది. ఈ అమ్మ రూపంలో వున్నది కూడా గురురూపమే, ప్రణవమే. ప్రణవమే అన్ని మంత్రాలకు మూలము. ఓం నమశ్శివాయ, ఓం నమో నారాయణాయ - ఇలా ఏ మంత్రం తీసుకున్నా, ప్రణవం ముందు వుండి తీరవలసినదే. ప్రణవం లేకపోతే ఆ మంత్రం శిరస్సులేని మొండెం లాగ వుంటుంది. ఓంకారానికి మూలం అహం శబ్దవాచ్యుడైన గురుదేవులే. సర్వ శబ్దములకూ మూలం ఓంకారమే. మీ అమ్మ (తమని ఉద్దేశించి చెబుతూ శ్రీ మాతాజీ) మంత్రానుష్ఠానం చేసుకునే సమయంలో మనస్సు మంత్రం మీదకు వెళ్ళేది కాదు. ఓంకారం దగ్గరే మిగిలిపోతూ (నిలబడిపోతూ) వుండేది. ఓంకారం ఉచ్ఛరించకుండా మంత్రానుష్ఠానం చేయనేకూడదు. ప్రణవాన్ని ఉచ్ఛరిస్తుంటే గురుదేవులే మిగిలిపోయేవారు. నామము, మంత్రము ఎంత పొడుగు వున్నా, మిగిలేది ప్రణవమే. ఖాళీ లోనుండి వచ్చే శబ్దం ప్రణవమే. (కావాలంటే ఒక ఖాళీ కుండగానీ, శంఖం గానీ మీ చెవి దగ్గర మూసి పట్టుకోండి. ఆ ఖాళీ నుండి మీకు ప్రణవం వినిపిస్తుంది.) ఈ విధంగా నాకు వచ్చిన అనుభవాన్ని వారికి విన్నవిస్తే, 'ఇహ అంతకంటే కావలసినదేమున్నది?' అన్నారు. నాకు చాలా టైమ్ పట్టింది. ఎందుకంటే సాధన, సిద్ధి వరకూ రావాలి కదా! లోపలికి వెళ్ళిపోవాలి.



అందుకనే శ్రీగురుదేవులు మనం ధ్యానానికి కూర్చునే ముందు ముందుగా కొద్దిసేపు ప్రణవం పూరించమనేవారు. నిటారుగా, సుఖాసనంలో కూర్చుని, నాభి నుండి ప్రణవాన్ని పూరించాలి. మనం 'మ్' అనే అర్ధమాత్ర అనేటప్పుడు అది వెళ్ళి మళ్ళీ నాభిస్థానానికే చేరుకుంటుంది. ఈ విధంగా ప్రణవాన్ని పూరించాక, నీ మనస్సుకు

ఇష్టమైన, గురు ప్రసాదితమైన మంత్రాన్ని జపించాలి. దీనికంతకూ మూలం గురుదేవులే.

గణపత్యుపనిషత్తు చదువుతుంటే అఖండానందానుభూతి కలుగుతుంది. 'ఓం లం గణపతయే' అని మొదలవుతుంది. 'లం' అనేది ప్రకృతి పరమైన పృథ్వీ తత్త్వాన్ని సూచించే బీజాక్షరం. (అందుకనే మనం అనుష్ఠానం చేసేటప్పుడు 'ల మిత్యాది పంచ పూజ' అని చేస్తాం.)

ఈ ఉపనిషత్తు ఇంకా చెబుతోంది. **'త్వమేవ ప్రత్యక్షం తత్త్వమసి। త్వమేవ కేవలం కర్తాసి। త్వమేవ కేవలం ధర్తాసి। త్వమేవ సర్వం ఖల్విదం బ్రహ్మాసి। త్వమ్ సాక్షాత్ ఆత్మాసి నిత్యమ్। ఋతం వచ్మి సత్యం వచ్మి....'** అంతా నువ్వే, నువ్వే, నువ్వే ........ ఇది నిజం - ఇది సత్యం అని ఘోషిస్తోంది.
అంతా గురుస్వరూపమే. అందుకనే 'న గురోరధికం న గురోరధికం' అని శాసించి సదాశివుడు ఆ గురుధ్యానంలో మునిగి పోయాడు.

శ్రీ గురుదేవులు మరొక సూచన ఇచ్చారు - ధ్యానం (చేసే క్రియ), ధ్యేయం (చేరవలసిన గమ్యం), ధ్యాత (ధ్యానం చేసేవాడు). అదే విధంగా జ్ఞానం -జ్ఞేయం -జ్ఞాత (అంటే తెలుసుకోవడం, తెలుసుకోబడే వస్తువు, తెలుసుకునేవాడు). ఈ ముడులన్నింటికీ ఆధారం తానే. సృష్టి, స్థితి, లయాలకి కారణం ప్రణవమే. ప్రణవమే గురుస్వరూపం. నీకే రూపమైనా ప్రసన్న మవవచ్చు. కానీ ఆ రూపం అరూపమై పోయినా, అనుభూతిగా మిగిలిపోతుంది. గురుదేవులు ప్రసాదించే అనుభూతి శాశ్వతమైనది. గురుదేవుల యొక్క సర్వవ్యాపకత్వాన్ని అనుభవించడమే 'ఆరాధన'.

-సశేషం

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ భక్తులు, కొద్ది కాలం నుండి ఆశ్రమ స్థిర నివాసులు అయిన శ్రీ రుద్రబోయిన వీర్రాజుగారు 9-4-2018 సోమవారం నాడు శ్రీ సద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 44 సంవత్సరాలు. సద్గురు దేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# మాలదాసరి

- పళని

ఒక పల్లెలో ఒక మాలదాసరి అనే విష్ణు భక్తుడుండేవాడు. ఆ పల్లె ప్రక్కనే అడవిలో గల విష్ణు ఆలయానికి ప్రతిరోజూ తెల్లవారుజామునే వెళ్ళి బయటప్రాకారానికి మూడు ప్రదక్షిణాలు చేసి, గుడు బయటనే దేవుడికి ఎదురుగా కూర్చుని తుంబరతో హరికీర్తనలు పాడేవాడు. ఆలయ అర్చనలన్నీ పూర్తి అయ్యాక భక్తులిచ్చే ప్రసాదాన్ని తుంబుర మీద పెట్టుకుని అమృతంలాగ స్వీకరించేవాడు.

ఒకరోజు రాత్రి తెల్లవారిందనుకొని భ్రమపడి అర్ధరాత్రే లేచి ఆలయానికి బయలుదేరాడు. గాఢాంధకారం. పెద్ద మఱ్ఱి చెట్టు దగ్గరకు వచ్చాడు. కుళ్ళిన మాంసం దుర్గంధం గ్రహించాడు. దారి తప్పానని అప్పుడు గుర్తుకు వచ్చింది అడవి మధ్యలో ఒక బ్రహ్మరాక్షసి వుంటూ బాటసారులను భక్షిస్తున్నాడని. ఈలోగా ఆ బ్రహ్మరాక్షసి మీదకు దూకనే దూకాడు. ఆ మఱ్ఱి చెట్టూ, భూమి కూడా ఊగిపోయాయి. నల్లని కొండంత శరీరం, ఒక శవాన్ని గోచీగా పెట్టుకున్నాడు. పెద్దపెద్ద కోరలు, వికారమైన ముఖం, తాటికాయంత కనుగ్రుడ్లు, ఆ గ్రుడ్లలో కండలు పెరిగాయి. సొరంగం వంటి నోరు, బానబొజ్జ, వున్నపళాన యముని పాశంలాంటి తన రెండు హస్తాలతో ఈ మాలదాసరి నడుమును పట్టుకున్నాడా రాక్షసుడు.

దాసరి యే మాత్రం చలించకుండా "ఓ రాక్షసీ! నాదొక మనవి. నాకొక వ్రతం ఉంది. విష్ణుదేవుని నిత్యమూ అర్చించాలి. నా యందు దయ వుంచి నన్ను వదిలితే దేవుణ్ణి పూజించిన వెంటనే నీ దగ్గరకు తిరిగి వస్తాను. అప్పుడు సంతోషంతో నన్ను భుజించు. నన్ను నమ్ము. నా నాలుక అసత్యమెరుగదు" అన్నాడు.

ఆ బ్రహ్మరాక్షసుడు భయంకరంగా నవ్వి, "నోటిదాకా వచ్చిన మాంసపు ముద్దను ఎవరైనా వదులుకునే వెర్రివారెవరైనా వుంటారా? మృత్యువుకు భయపడి పారిపోయేవారే అందరూ! తిరిగి వచ్చేవారెవరైనా వుంటారా? చాలించు నీ తెలివితేటలు!" అన్నాడు ఆ రాక్షసి.

దాసరి వినయంతో "తండ్రీ! పుట్టిన వారికి మృత్యువు తప్పదు. మనిషికి ప్రాణం సత్యం! ప్రమాణం చేసి చెబుతున్నాను -నేను తిరిగి రాకపోతే నా ఇష్ట దైవాన్ని ఇతర దైవాలతో సమానంగా చూసినంత మహాపాపం నాకు చుట్టుకొనుగాక!" అన్నాడు.

ఈ ప్రమాణం రాక్షసికి వింతగానూ, అద్భుతంగానూ తోచింది. అతని హృదయంలో భక్తి చిగురించింది. కుతూహలం రెమ్మలు వేసింది.

'సరే చూద్దాం ఈ మనిషిని' అనుకున్నాడు. "సరే పోయిరా! నీ కోసం నిరీక్షిస్తూ వుంటాను. నీ మాటలే ఇంత రుచిగా వున్నాయి. ఇహ నీ మాంసం ఎంత రుచిగా వుంటుందో చూస్తాగా!" అన్నాడు రాక్షసి.

దాసరి ఉప్పొంగిపోతూ వెళ్ళి యథా పూర్వకంగా కీర్తనలతో దేవుణ్ణి స్తుతించి, ప్రసాదం తీసుకుని, పరుగు పరుగున రాక్షసి దగ్గరకు తిరిగి వచ్చాడు. ఆ రాక్షసి 'అరే! వీడు అసలు మనిషేనా!' అనుకున్నాడు తన దగ్గరకు తిరిగి వచ్చిన ఆ దాసరిని చూసి.

"ఇప్పుడు నీవు నన్ను యథేచ్ఛగా భుజించవచ్చు" అన్నాడు దాసరి. ఆ రాక్షసుడి మనస్సు కరిగిపోయింది. రెండు చేతులు జోడించి, "తండ్రీ! నీవు మహాభక్తుడవు! నీ ప్రతిజ్ఞా పాలన అమోఘం! దేవతలకు కూడా అలభ్యం! ఇప్పటికే ఎందరినో పొట్టనపెట్టుకుని, ఈ మురికి దేహాన్ని పెంచుకున్నాను. చేసిన పాపం చాలు! నేను క్రిందటి జన్మలో మానవుణ్ణే. ఏ మహాత్ముడో ఈ దారిన రాకపోతాడా! వాని కటాక్షంతో ఈ జన్మను తొలగించుకుందామని ఎప్పటినుండో ఈ చెట్టుమీద కూర్చుని ఎదురు చూస్తున్నాను. నా అదృష్టం పండింది. ఇంతకాలానికి నీ దర్శనం కలిగింది. పరశువేది ఇనుమును బంగారంగా మార్చినట్లు నీ పుణ్యఫలం నన్ను తిరిగి మానవునిగా మారుస్తుంది. దయచేసి నాకు నీ పుణ్యాన్ని ధారపొయ్యి" అని దీనంగా వేడుకున్నాడు.

దానికి దాసరి "నేను వాగ్దానం చేసింది ఈ దేహాన్ని మాత్రమే. నా వ్రత ఫలాన్ని కాదు. ఈ దేహాన్నే నీవు తీసుకో" అన్నాడు.

ఆ రాక్షసుడు దీనంగా "నీకు తెలియని రహస్యం వున్నదా? దానం వలన మీ పుణ్యం రెట్టింపు అవుతుంది. నీ పుణ్యాన్నంతా దానం చేయనక్కర్లేదు. సగం చాలు ..... సగం కూడా అక్కర్లేదు. పోనీ ఈ రోజు దేవుని ముందు పాడిన పాట వలన వచ్చే పుణ్యం చాలు. పోనీ పాటలో సగం .... లేదా ఒక్క చరణం ..... మనసారా అర్పిస్తే చాలు. రవ్వంత పుణ్యం కొండంత పాపాన్ని హరిస్తుంది" అని వేడుకున్నాడు.

దాసరి హృదయం కరిగిపోయింది. ఆ రాక్షసుడి విశ్వాసానికి మురిసిపోతూ "ఓ విష్ణుదేవా! భక్తవత్సలా! ఈ రోజు నీ ముందు పాడిన పాటలోని ఒక చరణానికి వచ్చే పుణ్యం అంతా ఈ బ్రహ్మరాక్షసుడికి చెందుగాక అని మనసారా అర్పిస్తున్నాను" అని ప్రమాణం చేశాడు.

బ్రహ్మరాక్షసుడు క్షణంలో బ్రాహ్మణ కుమారుడయ్యాడు!!

# జీవబ్రహ్మైక్య అనుసంధానం

- రమణ ప్రసాద్

(శ్రీ మాతాజీవారి ప్రసంగాల నుండి)

భగవంతుడెక్కడ ఉన్నాడు? ఉంటే చూపించండి అంటారు కొందరు. భగవంతుడిని ఎక్కడ వెదకాలి? భగవంతుడు నీలోనే ఉన్నాడు. దానినే సత్యవస్తువు అని అంటారు. దానికి మార్పు లేదు. అది నీలో లేకపోతే నీ జీవితమే లేదు. భగవంతుడిని తెలుసుకోవాలంటే శ్రద్ధ, భక్తులు ఉండాలి. ఈ రాకెట్‌యుగంలో అన్నీ "స్పీడ్"గా జరుగిపోతున్నాయి. శ్రీ వెంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్ళేవారు ఈ రోజుల్లో "నెట్"లో చూసుకుని ఆ టైమ్‌కి వెళ్ళి దర్శనం చేసుకొని వస్తున్నారు. వారు, - "వెళ్ళాము- చూశాము- వచ్చేశాము" అంటారు. వారు ఏ దృష్టితో వెళ్ళారు? శ్రీగురుదేవులు -" నలుగురు వ్యక్తులుశ్రీ వెంటేశ్వరస్వామి దర్శనానికి తిరుపతి వెళ్ళారు. వారిలో ఒకరు శిల్పి, ఇంకొకరు ఆగమ శాస్త్రకారుడు,మరొకరు స్వర్ణకారుడు, నాల్గవవాడు. భక్తుడు. శిల్పి వెంకటేశ్వరుడి మూర్తిలో శిల్ప కళా విశేషాలను చూశాడు. ఆగమ శాస్త్రకారుడు అక్కడ వేసిన యంత్రం శాస్త్రానుసారంగా ఉందా?లేదా? అని చూశాడు. స్వర్ణకారుడు స్వామికి అలంకరించిన బంగారుఆభరణాలను పరిశీలించాడు. కాని భక్తుడు కేవలం స్వామినే చూస్తూ, ఆయన గుణగణాలను కీర్తిస్తూ ఆనందంతో మైమరచిపోయాడు.

శ్రీగురుదేవుల వద్దకు ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ఆంధ్రప్రభ ఎడిటర్లు వచ్చేవారు. వారు ఏ అర్థరాత్రో వచ్చి దర్శనం చేసుకొని వెళ్ళేవారు. "మేము ఇక్కడికి మా బ్యాటరీలను "ఛార్జ్"" చేసుకోవటానికి వస్తున్నాము. ఆ గురుశక్తి మాకు ఆఫీసులో ఏ ఒడుదుడుకులు రాకుండా, ఏ దుష్టశక్తులు మాకు హాని కలిగించకుండా కాపాడుతోంది. ఇది మా అనుభవం" అని చెప్పేవారు.

విషయచింతన జన్మకు కారణం అవుతోంది. ఇక్కడ మన కాలం భగవచ్చింతనలో గడుస్తోంది. మనం చేసేదానిలో భగవంతుని చూడకపోతే దానికి ప్రకాశం లేదు. లక్షలు ఖరీదు చేసే ఇన్‌స్ట్రుమెంట్ ఉన్నా అది కరెంట్ లేపోతే పని చేయదు. మన జీవితంకూడా భగవంతుని

చేతిలో పరికరం. భగవశ్శక్తి వలననే నడుస్తోంది.

పురాణవైరాగ్యం, ప్రసూతి వైరాగ్యం, శ్మశానవైరాగ్యాలు మానవుడిని తరింపచేయలేవు. సాధనలో పురోగమించాలంటే కావల్సినది దృఢమైన వైరాగ్యం. గురుబోధా శ్రవణం శ్రద్ధగా చేసి, దానిని మననంలోకి తెచ్చుకోవాలి. మనస్సు అందులో లయించిపోవాలి. జనక మహారాజు. కుళశేఖర ఆళ్వారులు ఎప్పుడూ భగవద్విచారణలో వుండావారు. శివాజీ తన గురువైన సమర్థులకు తన రాజ్యాన్నే త్యాగం చేశాడు. ఉత్తమ శిష్యుడిగా ప్రకాశించాడు. గమ్యాన్ని చేరాలంటే పట్టుదల కావాలి. పట్టుదల లేకపోతే ఏ కార్యాన్ని సాధించలేము. జీవితం వున్నప్పుడే లక్ష్యాన్ని సాధించాలి.

గోదాదేవి రంగనాధుడిని వరించింది. ఆమెను పెంచినది విష్ణుచిత్తుడు. రంగనాధుని ఆంతరింగిక భక్తుడు. గోదాదేవి ఆలయ ప్రవేశం చేసి రంగనాధునిలో ఐక్యమైతే, విష్ణుచిత్తుడు పెంచిన ప్రేమతో ఆయన "ఎక్కడ నా కూతురు?" అని అడిగాడు రంగనాధుడిని. జీవుడికి బ్రహ్మకు జరిగిన కళ్యాణం. అదే జీవబ్రహ్మైక్యానుసంధానం.

ఆధ్యాత్మిక దృష్టిని పెంపొందించుకోండి. గంధపుచెక్కను రాయిమీద అరగదీస్తేనే గంధం సువాసనలను వెదజల్లుతుంది. మనం విన్నదానిని విచారణ చేస్తే"అంతరంగ తిరుప్పావై" అవుతుంది. మనం ఆశ్రమంలో ఉన్నాం అది మనభాగ్యం. మనకు గురుదేవులు సన్నిహిత సేవలను ప్రసాదించారు. వాటిని మనం త్రికరణశుద్ధిగాచేయాలి.

మనకు సమర్థులైన పాదం దొరికింది. వారు నిర్దేశించిన విధంగా ఆచరించి లక్ష్యాన్ని సాధించాలి.నిరంతర విచారణ ద్వారా ఆధ్యాత్మికానుభవం పొందాలి. మన జీవితానికి ఏది ప్రేయస్సో, ఏది శ్రేయస్సో తెలుసుకొని శ్రేయోమార్గాన్ని ఎన్నుకోవాలి. ఉన్నదొక్కడే దేవుడు. ఆయన దృష్టిలో మనం ఉన్నాం. కావున నిర్భయులం.

ఇప్పుడు మనం కొంత సేపు ధ్యానం చేద్దాం. ధ్యానంలో నిటారుగా కూర్చోవాలి. మనం ధీరులం, తప్పక లక్ష్యాన్ని సాధిస్తాం అనే ధైర్యోత్సాహాలతో ధ్యానానికి కూర్చోవాలి. మన ఉనికికి ముఖ్యమైనది ప్రాణం. ఇది ఉంటేనే మనం జీవించి ఉంటాం.అందరూ దీర్ఘంగా శ్వాస నాభినుండి తీసుకోండి. శ్వాస పీల్చేటప్పుడు(పూరకం) "సో " అని, శ్వాస

వదిలేటప్పుడు(రేచకం) "హం" అని అనాలి. శ్వాస ప్రక్రియ సహజంగా అయినప్పుడు, శ్వాస వేగం తగ్గుతుంది. శ్వాస లేని తురీయస్థితి కలుగుతుంది. "సోऽహం"- దీనినే అజపాజపగాయిత్రి జపం అంటారు. అది నిరంతరం మనలో జరుగుతూనే ఉంది. "సోऽహం" అంటే "అది నేను". అని "ఆ పరమాత్మ నేనై ఉన్నాను" అని ధ్యానం చేయాలి. అలా చేయగా చేయగా"తానే పరమాత్మ" అనే అనుభూతిని పొందుతాడు.

నీ వెన్నెముకలో ఇడ, పింగళ నాడుల మధ్య సుషుమ్న నాడి వుంది. అది వెంట్రుక కన్నా సన్నగా ఉండి మూలాధారం నుంచి సహస్రారంలో చేరుతుంది. అది అధోముఖంగా ఉంది. అంటే ప్రపంచ దృష్టితో ఉంది. "సోऽహం" అనే జపం చేత దానిని ఊర్ధ్వముఖంగా చేయాలి. ఆ సహస్రారంలో ప్రకాశించే గురుదేవుడే భోగశయనుడు. ఆయన సహస్రారంలో స్థితుడై తన బుల్లి పాదాలను భ్రూమధ్యస్థానంలో మనకు అందిస్తున్నాడు. మనం దృష్టి భ్రూమధ్యస్థానంలో ఉంచి ధ్యానం చేయాలి.

మనస్సు నిలవాలంటే మనం నిత్యం చేసే పూజ మానసికంగా చేస్తే మనస్సు నిలుస్తుంది. అది ఎప్పుడైనా ఎక్కడైనా చేయవచ్చు. పూజకంటె సత్సంగం గప్పది. అట్టి సత్సంగంలో మునిగి తేలే గొప్ప అవకాశం మనకి శ్రీగురుదేవులు ప్రసాదించారు.

లోపలివాడు ఉండబట్టే నువ్వు ప్రకాశిస్తున్నావు. సాధన చక్కగా చేసి ఆ భోగాన్ని అనుభవించాలి. ఆ ఆనందాన్ని పొందాలి. "మనం ధీరులం. నన్ను చూసుకోవటానికి నా ప్రభువు ఉన్నాడ'నే దృఢ విశ్వాసంతో సాధనలో ముందడుగు వెయ్యండి. మనస్సును అంతర్ముఖం చేసుకుని మీ హృదయంలో ప్రకాశిస్తున్న గురుదేవులను దర్శిస్తూ ధ్యానం చేయండి. శ్రీ గురుదేవులు అట్టి శక్తిని, భక్తి, అఖండ భక్తి జ్ఞాన వైరాగ్యాలను ప్రసాదించి సర్వదా కాపాడుగాక! సుఖీభవ!!

# త్రిపురా రహస్యం

(గత సంచిక తరువాయి)

- రమణ ప్రసాద్

**జ్ఞాన ఖండం**

18వ అధ్యాయం

దత్తాత్రేయుడు- భార్గవా! ఆ పరాచితి తెలియబడేదికాదు అని చెప్పాను. అంతర్ముఖ దృష్టి ఉన్నప్పుడే తెలుస్తుంది. దానిని తెలుసుకోవటానికి ఇంకొక సాధనం అవసరం లేదు. మనస్సు స్వప్రకాశం అవాలి. దానినే 'విత్తి'(జ్ఞానం) అంటారు. నేను అనుకొనే స్వరూపమే నీ నిజమైన, నాశన రహితమైన స్వరూపం. అది ద్రష్ట కాదు. దృశ్యమూ కాదు. నువ్వు ఇది తెలిసికూడా భ్రాంతిలో పడుతున్నావు.



ప్రశ్న- నేను చిద్రూపుడను అనే భావం నాకు కులగటం లేదు. నేను దేహాన్ని అనే భావం కలుగుతోంది. ఎందువలన?

సమాధానం- దేహాదులను సంకల్పించి నప్పుడే ఆ భావం కలుగుతోంది. అంతేకాని సహజంగా దేహం ఆత్మగా భాసించటం లేదు. శరీరంకంటె ఇతర వస్తువులను అవి నేను అనుకొంటున్నావా? లేదు. దృశ్య రహితమైన దృక్కు మాత్రమే నీవు అవుతావు. దృక్ అనేది స్వప్రకాశం. నువ్వు ఎప్పుడూ దృక్ స్వరూపుడవే. ఒక్కసారి ఆ పరాచితి దర్శనం అయితే, నేను పొట్టి, నేను పొడుగు, నేను బ్రాహ్మణుడను అనే దేహాత్మ భ్రాంతి (సంసార కారణమైన అజ్ఞానం) నశిస్తుంది. అప్పుడు సవికల్ప సమాధి లభిస్తుంది.

మోక్షం అనేది ఆకాశానికి వెనకో, పాతాళంలోనో లేదు. సంకల్పాలను వదిలేసిన మరుక్షణంలో తనలోనే తన స్వరూపం భాసించటమే మోక్షం. కొత్తగా పొందటం అనేది లేదు.

ప్రశ్న -అయితే శ్రవణ మననాదులు ఎందుకు?

సమాధానం - 'మోక్షం కొత్తగా పొందదగినది' అనే అజ్ఞానం నాశనం చేయటంతో వాటి పని తీరిపోతుంది. ఆత్మ స్వరూపమే మోక్షం. ప్రపంచం

అంతా ఈ చితిలోనే ఉండి ప్రతిబింబరూపంగా, భిన్నంగా ఉన్నట్లు కనపడుతోంది. చితి కంటె భిన్నంగా ఏదీ లేదు.

భార్గవుడు ఇలా ప్రశ్నించాడు -భగవన్! చైతన్యము - ప్రపంచము - చిదాత్మకమే అనే విషయం అనుభవానికి రావటం లేదు. సంకల్పాలను వదిలేస్తే చాలు, నిర్వికల్ప సమాధి సిద్ధిస్తుంది అని అదే ఆత్మ జ్ఞానమని అన్నారు. ఇదికూడా విశదం కాలేదు. మనస్సు వల్లే ఆత్మకు బంధ మోక్షాలు కలుగుతున్నాయి. అటువంటప్పుడు మనస్సే ఆత్మ ఎలా అవుతుంది?

దత్తాత్రేయుడు - చితి, త్రిపుర- ఒకటే అయినా విచిత్ర రూపాలతో భాసిస్తోంది. అద్దం ఒకటే అయినా అనేక ప్రతిబింబాలుగా కనపడుతోంది కదా! సుషుప్తిలో నిరాకారంగా ఉన్న మనస్సే, స్వప్నంలో ద్రష్ట, దృశ్యం, దర్శనంగా కనపడుతోంది కదా! ఆ త్రిపురయే చిత్ర విచిత్ర ప్రపంచ రూపంగా భాసిస్తోంది. రెండుగా ఉన్నట్లు కనుపించినంత మాత్రాన ద్వైతం కాదు. స్వప్నంలో కనిపించే ద్వైతం సత్యం కాదు కదా!

స్వప్నంలో మనస్సే ద్రష్ట, దృశ్యం, దర్శనంగా మారింది. కలలో కనపడే వస్తువులు కలలో ఉపయోగిస్తున్నాయి. కలలో గొడ్డలితో చెట్టు నరుకుతావు. అయినా అది అసత్యమే. అలాగే లోకంలోవి, లోకదృష్టిలో ప్రయోజనకరాలే అయినా పరమార్థంలో సత్యాలు కావు. అటువంటప్పుడు ఈ జ్ఞానాలకు సాధనమైన మనస్సు సత్యం ఎలా అవుతుంది?

పశ్న -పరిపూర్ణమైన పరాచితి పరిచ్ఛేదం అవటం అంటే ఏమిటి?

సమాధానం - పరాచితి పరిపూర్ణం. ఆ పూర్ణ స్వరూపంలో ఒక అంశంలో"నేను" అనే అభిమానం ఉండటమే పరిచ్ఛేదం.

-సశేషం

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, ఆశ్రమ స్థిర నివాసులు అయిన శ్రీమతి బచ్చు భాగ్యలక్ష్మిగారు (రామ్ ప్రసాద్ భార్య)1-4-2018 ఆదివారం నాడు శ్రీ సద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 46 సంవత్సరాలు. సద్గురు దేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# జీవన అనుభవం

- గాలి జగదీశ్

ఒక వృద్ధ మహాత్మునితో ఒక గృహస్థుడు మాట్లాడుతూ "స్వామీ! మీ జీవితం యొక్క సారరూపమైన అనుభవం ఏమిటి?" అని అడిగాడు. అప్పుడాయన "చూడు నాయనా! ఇదే నా జీవితంలో సారమైన అనుభవం ..." అంటూ నోరు తెరిచాడు. లోపల పళ్ళు లేవు, నాలుకను గుండ్రంగా త్రిప్పి "ఇదే బాబూ! నా జీవితానుభవం" అన్నాడు.

అప్పుడా గృహస్థుడు "స్వామీ! మాకేమీ అర్థం కాలేదు. దయచేసి వివరంగా చెప్పండి" అని అడిగాడు.

అప్పుడా స్వామి మాట్లాడుతూ "చూడు నాయనా! పళ్ళుగట్టివి పెళుసువి కాబట్టి ఊడిపోయాయి. మెత్తగా ఉండే నాలుక మటుకు అలాగే ఉంది. గట్టిగా (అహంకారి) ఉన్నవాడు ఏప్పుడో ఒకప్పుడు పోతాడు. అదే నా అనుభవం" అన్నాడు.

పెళుసుతనం, మొండితనం ఉన్నవాడు త్వరగా పోతాడని అర్థం. దేహాన్ని 'నేను' అని అహంకరించి ఈ బుద్ధి ద్వారా విర్రవీగేవాడు త్వరగా నశిస్తాడు. ఈ ప్రాపంచిక విషయాల పట్ల అహంకారం లేనివాడికి, భక్తి, ఆరాధన, ఈశ్వర ప్రేమ కడపటి దాకా నిలిచి వుంటాయి.

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా మే 2018, జూన్ 2018 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

మే 2018 : AS 5604, 5626, 6712, 7069, 7125, 7274, 7468, LM 4112,4114

జూన్ 2018 : AS 4166, 4736, 6654, 6713, 7054, 7275, 7282, 7385, 7483 LM 4115

మేనేజరు

# మానవ జన్మ ఉత్కృష్టత

- మురళీ

శ్రీ ఆది శంకరులు 'జన్తూనాం నర జన్మ దుర్లభమ్' అన్నారు. జీవుడికి మానవ జన్మ లభించటం కడు దుర్లభము. అనేక జన్మల సుకృతం వలన గానీ అది కలుగదు. సకల జీవులు సామాన్య జ్ఞానమును మాత్రమే కలిగి ఉంటారు. కానీ మానవుడు మాత్రమే నిత్యానిత్య జ్ఞాన విచారణతో అనాది అవిద్యా ఆవరణ తొలగించుకోవడానికి సమర్థుడు. ఇతర జన్మలందు జీవులకు ఇట్టి సమర్థత ఉండదు. మానవుడు తన అవిద్యా భ్రాంతిచేత తాను మరచినట్టి తన స్వరూప సుఖమును సాధించి శాశ్వతానందమును పొందటానికి సన్నిహితుడుగా ఉన్నాడు. ఇట్టి అవకాశమును గుర్తించి, నిత్య నిరతిశయ సుఖమగు ఆత్మజ్ఞాన ప్రాప్తి కోసం ప్రయత్నించేవాడే మానవ జన్మను సార్థకం చేసుకోగలడు.

ఈ ప్రపంచంలో మానవ జీవితం అంటే యుద్ధ భూమిలో ప్రవేశించటమే. ప్రతిమానవుడు దుఃఖాన్ని జయించి, సుఖాన్ని పొందటానికి సర్వదా ప్రయత్నం చేస్తుంటాడు. ఇది సహజం. ఎంత ప్రయత్నించినా దుఃఖమనే శత్రువు తాత్కాలింగా మరుగునపడి, మరల వస్తూనే వుంటుంది. మానవుడి సామాన్య ప్రయత్నం చేత ఈ దుఃఖం శమించదు. బాగా ప్రయత్నించేవారు శాశ్వత సుఖ సామ్రాట్ అవటం సంభవమనీ, అట్టి స్థితి ఒక్క ఆత్మజ్ఞానం వలననే సంభవమని శాస్త్రము, అనుభజ్ఞులగు మహనీయులు కూడా బోధిస్తున్నారు. కాబట్టి మానవునికి ఆత్మజ్ఞానమును పొందటం ఆవశ్యకం అవుతోంది.

ప్రారబ్ధ కర్మ ఎట్టివారికైనా విధించబడిన శిక్ష, ఇది బలవత్తర మైనది. మానవుడు ప్రారబ్ధ సుఖదుఃఖ ఫలాలను అనుభవించక తప్పదు. సుఖానుభవము ప్రతివారికి ఇష్టమే. కాని క్లేశ, విషాద, దుఃఖాలను ఎవరూ అనుభవించాలనుకోరు. ప్రారబ్ధం సమస్త దుఃఖానుభవాలను నిర్లిప్తతతో, నిమిత్తమాత్రునిగా అనుభవించటానికి సమర్థుడవటానికి ఆత్మజ్ఞానము అత్యంత ఆవశ్యకము. లేకపోతే మానవుడు తన ధర్మాధర్మాలను సక్రమంగా నిర్వర్తించలేక శోకగ్రస్థుడవుతాడు. మానవునికి ప్రారబ్ధ కర్మలు, ఆదివ్యాధుల వలన కలుగు దుఃఖాన్ని శాశ్వతంగా నిర్మూలించేటటువంటి పరమ ఔషధమే ఆత్మజ్ఞానము.

ఆత్మజ్ఞానము తప్ప తక్కినవేవీ మానవుని దుఃఖాన్ని హరించజాలవు.

ఆత్మ ఈ ప్రపంచమంతా నిండి వున్నది. ఆత్మ నాశనము లేనిది. చంపేది కాదు, చంపబడేది కాదు. పుట్టేది కాదు, మరణించేది కాదు. అచలమైనది, స్థిరమైనది, సనాతనమైనది. మానవునకు తన ధర్మమును ఆచరించుట ఆవశ్యకము, తప్పనిది. ఆత్మజ్ఞానమనే వజ్రాయుధముతో యుద్ధం చేస్తేగాని మానవునికి నిత్య నిరతిశయమగు సుఖప్రాప్తి కలగదు. ఇదే శాశ్వత సుఖము, మోక్షము. కాబట్టి మానవునకు ప్రారబ్ధమును జయించటానికి ఆత్మజ్ఞానము అత్యంత ఆవశ్యకము. ఈ జ్ఞానము జాతి, మత భేదములతోగాని, స్త్రీ పురుషాది విచక్షణతోగాని సంబంధించినది కాదు.

ప్రీతి, నిశ్చయముతో ప్రయత్నించే వారందరూ కాలక్రమాన పొందుతారనటానికి సందేహం లేదు. ఆత్మజ్ఞానం పొందగలుగు జ్ఞానం కలగటమే మానవజన్మ విశేషము. ఇది గురువు అనుగ్రహం వలన మాత్రమే కలుగుతుంది. జనన మరణ కాలచక్రం నుండి విముక్తి కోరే వారందరూ తప్పక ఒక సమర్థుడైన సద్గురువును ఆశ్రయించి, వారి అనుగ్రహానికి పాత్రులై, ఆత్మజ్ఞానాన్ని పొందగలరు. మానవ జన్మను వృథాగావించటం అనుచితము, ఆత్మహాని కూడా అని గ్రహింపవలెను.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

మే 2018

10 గురువారం - శ్రీగురుదశమి(హనుమజ్జయంతి) - సా॥ 5 గం॥లకు సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

29 మంగళ - అధిక జేష్ఠ పౌర్ణమి - సాయంత్రం 5-30ని॥ శ్రీ సద్గురు పాద పూజ, భక్తసమారాధన.

జూన్ 2018

08 శుక్రవారం - శ్రీగురుదశమి, సాయంత్రం 5గం॥30 నిలకు శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

28 గురువారం - నిజ జేష్ఠ పౌర్ణమి, సాయంత్రం 5-30ని॥ శ్రీ సద్గురు పాద పూజ, భక్తసమారాధన.



12-4-18న
మైత్రేయాశ్రమము
గూడవల్లి నందు
నిర్వహించిన
హరేరామ నామ
సప్తసప్తాహ దీక్షా
విరమణ సందర్భంగా





5 నుండి 8 ఏప్రియల్
వరకు విశాఖపట్నం,
దాసరి ఆనంద్‌గారి
స్వగృహము, మరియు
గురువాయురప్పా
శ్రీకృష్ణమందిరము
నందు జరిగిన సత్సంగ
సమావేశ దృశ్యములు

## శుభాభినందనలతో ...



INDIGENEOUS anadig MAKE
CAKT-02, CAKT-05, CAKT-06 & TAK-011-03
ENGINE ROOM INSTRUMENTATION FOR EKM SUBMARINE
INDIGENOUS INSTRUMENTS FITTED ON
• INS SINDHUKESRI
• INS SINDHUSHSTRA
• INS SINDHUVIR
• INS SINDHUGHOSH
• INS SINDHURAJ
• INS SINDHUVIJAY
• INS SINDHUKIRTI
anadig systems

# జ్ఞానికి సుఖదుఃఖాలు ఉంటాయా?

- రమణ ప్రసాద్

భగవంతుడిని తెలుసుకొన్నవాడికి అన్ని సందేహాలు తొలిగిపోతాయి. భగవంతుడు ఆస్తికుడిలోను, నాస్తికుడిలోను; సజ్జనుడిలోను, దుర్జనుడిలోను; జాగ్రత్ స్వప్న సుషుప్త్యవస్తలలోను; నిత్యానిత్య వస్తువులలోను; ఎక్కడ చూసినా అంతటా నిండి ఉన్నాడని గుర్తిస్తాడు.

ఒక ఊరిలో ఒక రైతు ఉండేవాడు. చాలా కాలంగా సంతానం లేదు. తాను తన భార్య కలిసి నోచిన నోముల పంటగా వారికి ఒక పుత్రుడు కలిగాడు. ఆతడిని అల్లారముద్దుగా పెంచుకుంటున్నారు. అతడు క్రమంగా పెరిగి పెద్దవాడైనాడు. రైతుకి ముసలితనం వచ్చేసింది. ఒకనాడు అతను పొలంలో పని చేసుకుంటుండగా తన ప్రక్కింటివాడు వచ్చి, 'నీ కొడుకుకు హఠాత్తుగా జబ్బు చేసింది. చివరి క్షణాలలో ఉన్నాడు. త్వరగా వెళ్ళు' అని చెప్పాడు. రైతు వెంటనే ఇంటికి పరిగెత్తాడు. కాని అప్పటికే ఆ కుర్రవాడు మరణించాడు. భార్య కన్నీరు మున్నీరుగా ఏడుస్తోంది. కాని రైతు కంట తడి పెట్టలేదు. 'నీ కొడుకు చనిపోతే నువ్వు అలా నుంచుండి పోయావేమిటి? నీకు దుఃఖం కలగటంలేదా?' అని అక్కడ ఉన్నవారు అడిగారు. అతడు మౌనంగా ఉండిపోయాడు.

చాలా సేపు అయిన తరువాత, భార్యతో ఇలా అన్నాడు, 'నేనెందుకు దుఃఖించటం లేదో చెప్పనా? నిన్న రాత్రి నాకు ఒక కల వచ్చింది. ఆ కలలో నేనొక రాజును. నాకు ఏడుగురు రాకుమారులు ఉన్నారు. వారు స్ఫురద్రూపులు, వీరులు. వారు దినదిన ప్రవర్ధమానులై సకల విద్యాపారంగతులైనారు. ఇంతలో నాకు మెలకువ వచ్చింది. వారెవ్వరూ నాకు కనిపించలేదు. ఇప్పుడు నేను ఎవరికోసం దుఃఖించాలి? కలలోని రాజకుమారుల కోసమా? లేక ఇప్పుడు చనిపోయిన ఈ కుర్రవాడికోసమా? ఈ విషయం తేల్చుకోలేకపోవటం వల్ల నాకు దుఃఖం రాలేదు' అన్నాడు.

స్వప్నంలో చూసినది అసత్యం అని జ్ఞాని గ్రహిస్తాడు. జాగ్రత్ స్థితిలో జరిగినది సత్యంగా తోచినా, ఆ జగత్తు అసత్యం అని తెలుసుకొన్నవాడు కనుక పుత్రుని మరణానికి దుఃఖించడు. భగవంతుడే అంతటికీ కర్త, ధర్త, లయకారుడు. భగవంతుని ఇచ్ఛానుసారమే అంతా జరుగుతోంది అని జ్ఞాని అనుభవ పూర్వకంగా తెలుసుకొంటాడు.

# సాక్షి

-పరాశర ప్రసాద్

ఆత్మ నిర్విషయం నిరుపాధికం. అది ఈ విశ్వమునంతటికీ ఆధారమై అక్షరము, పరిపూర్ణ తత్త్వము కాబట్టి అందులో ఎటువంటి విక్షేపాలకు, అలజడులకు, చంచలత్వానికి అవకాశము లేదు. అయితే సమస్త అనుభవాలను ప్రకాశింపజేసే పరబ్రహ్మను నేను అనే స్థితికి మానవుడు ఎదగాలంటే దేహ, మనో, బుద్ధుల నుండి తనను తాను మరలించుకోవాలి. ఆ స్థితిలో బాహ్య విషయాదుల నుండి మరలి పోగలిగినప్పుడు 'సాక్షి' భావము పెంపొందుతుంది. ఆ స్థితిలో మనస్సులోని ఆలోచనలకు, భావాలకు, సంకల్పవికల్పాలకు తెర పడుతుంది.

ఆ స్థితిలో ప్రసన్నమైన 'నేను' చిన్మాత్రుడను. మంగళ స్వరూపుడను అనే అనుభూతి కేవలం 'సాక్షి' భావమే. అయితే మూడు అవస్థలలోను భోక్త, భోగ్యం, భోగ రూపంలో ఉన్నదానికి విలక్షణుడుగా, సాక్షిగా, చిత్ స్వరూపుడుగా ముందుగా భావన చేయాలి.

జ్ఞానేంద్రియాల ద్వారా సుఖదుఃఖాలను అనుభవించే భోక్త జాగ్రత్, స్వప్న, సుషుప్తి అవస్థలలో కలిగే ఎటువంటి అనుభవాన్నైనా త్రిపుటికి విలక్షణంగా తనని తానుగా గుర్తించాలి. అయితే సాక్షికి విషయ జ్ఞానానుభవం తప్పదు. ఆ అనుభవాన్ని నిరసించి, నిషేధించాలి. అదే సాధనా మార్గంలో మొదటి మెట్టు. ప్రపంచంలో జరిగే సర్వ కార్యాలకు సూర్య ప్రకాశమే ఆధారం. అయితే సూర్య భగవానుడు ప్రపంచ కార్యాలలో దేనిలోనూ చిక్కుకోకుండా సాక్షిగా వుంటున్నాడు. అలాగే చైతన్యమే విషయ ప్రపంచంలో మనోభావాలకి, బుద్ధిలో ఆలోచనలకి ఆధారము. అయినప్పటికీ ఆ క్రియలకు అంటకుండా తాను సాక్షి మాత్రంగా వుండ గలిగేటట్లు సాధన చేయాలి.

యదార్థంగా నేను యొక్క స్థితి అదే. అయితే మనస్సు యొక్క ఆధ్యారోపణచేత ఒక భ్రమ కలుగుతోంది. ఆ భ్రమని తొలగించుకో గలిగితే సాధకుడు సాధనలో పురోగమించినట్లే. మన ఇంటి వరండాలో మనం నిల్చుని వుండగా వీధిలో ఒక వివాహ సంబంధమైన ఊరేగింపును తిలకిస్తున్నామనుకోండి ఆ దృశ్యము గోచరించినంత వరకే దానిని చూడ గలుగుతున్నాము. అది సాక్షిగా అది అదృశ్యమైన వెంటనే తాను తానుగా మిగిలిపోతాడు. అదే విధంగా ప్రకృతి లీలలన్నింటికీ నిష్క్రియుడుగా

నిర్లిప్తంగా తిలకిస్తే 'సాక్షి' భావం పెంపొంది చివరికి ప్రకృతి కార్యాలు, సంబంధాలు అంతరించి తాను తానుగా మిగిలిపోతాడు. విషయ జ్ఞానం వున్నంతవరకు సాక్షి అది అంతరించిన మరుక్షణం తానుగా ప్రకాశిస్తాడు.

## వార్తా లహరి

1) 3-4-18 తె॥జా 4గం.లకు బయలుదేరి గుండుగొలను బ్రాంచి సందర్శించి, మధ్యాహ్నం 12గం.లకు విశాఖపట్నంలో జరిగిన త్రయాహ్నిక సత్సంగాలలో పాల్గొన్నారు.
2) 3-4-18 సాయంత్రం 5-30ని॥ల నుండి రాత్రి 9గం.ల వరకు విశాఖ పట్నంలోని మురళీ నగర్‌లో సాయినాన్నగారి ఆధ్వర్యంలో జరిగిన సత్సంగంలో పాల్గొన్నారు.
3) 4-4-18 రాత్రి 9-30ని॥లకు డా॥ దుర్గారావుగారి ఒయాసిస్ ఫెర్టిలిటీ సెంటర్ ప్రారంభోత్సవం చేశారు.
4) 5-4-18 నుండి 8-4-18 వరకు సీతమ్మధారలో దాసరి ఆనంద్‌గారి స్వగృహములో ఉదయం వేళలో, సాయంత్రం 5గం. నుండి రాత్రి 8గం. వరకు గురువాయురప్ప శ్రీకృష్ణమందిరంలో సత్సంగ కార్యక్రమాలు, సర్వనామ సంకీర్తన నిర్వహించారు.
5) 9-4-18 శ్రీకాళీవనాశ్రమము నంబూరులో మావులేటి నారాయణ రాజుగారి గురుసాయుజ్య ఆరాధన కార్యక్రమంలో పాల్గొన్నారు.
6) 10-4-18 కాకినాడలో చక్రధర ప్రసాద్‌గారి గృహప్రవేశ కార్యక్రమం, సర్వనామ సంకీర్తన ఏకాహం, శ్రీగురుదశమి పాదపూజలో పాల్గొన్నారు.
7) 12-4-18 గుంటూరు జిల్లా, గూడవల్లి, మైత్రేయ ఆశ్రమంలో ఉదయం 7గం.లకు సప్తసప్తాహ హరేరామ నామ దీక్ష విరమణలో పాల్గొన్నారు. తిరిగి అదేరోజు ఉదయం 11గం.లకు శ్రీకాళీవనాశ్రమం నంబూరులో బచ్చు భాగ్యలక్ష్మిగారి గురుసాయుజ్య ఆరాధన కార్యక్రమంలో పాల్గొన్నారు.
8) 13-4-18 గుంటూరులో బచ్చు రాం ప్రసాద్‌గారి గృహంలో ఏకాహ్నిక సర్వనామ సంకీర్తనలో పాల్గొన్నారు.
9) 14-4-18 గూడవల్లిలోని మైత్రేయ ఆశ్రమం మాతాజీవారితో వచ్చిన భక్తులకు ఆశ్రమ సందర్శనం, సంకీర్తన, ప్రవచనం చేశారు.
10) 17-4-18 నుండి 19-4-18 వరకు హైదరాబాద్ బ్రాంచ్ కార్యక్రమాలలో పాల్గొన్నారు.

# యోగవాశిష్ఠము

(గత సంచిక తరువాయి) - సుషుమ్నా ప్రసాద

## శిఖిధ్వజుని కథ

చూడాల శిఖిధ్వజునింకా పరీక్షించాలనుకొన్నది, వెంటనే ఆమె వొక గదిలోకి ప్రవేశించి, తన యోగ శక్తి వలన, వొక ప్రియుని సృష్టించింది, ఆమె అతనినాలింగనము చేసినట్లు ప్రదర్శించింది. శిఖిధ్వజుడామె కొరకువెదికి, ఆమెను వొక వుద్యానవనములో, ప్రియుని గాఢాలింగనములో చూచాడు కాని అతనిలో కించిత్తైనా మార్పులేదు, అతనిలో క్రోధము వచ్చిన సూచనలేమిలేవు.



చూడాల శిఖిధ్వజుని ప్రవర్తనను పరీక్షించటాని కామె తనచెడు ప్రవర్తనకు సిగ్గుపడుతున్నట్లు తలదించుకొన్నది. శిఖిధ్వజుడు చూడాలతో, మధుర స్వరముతో మాట్లాడాడు. "మీరంత త్వరగా నావద్దకెందు కొచ్చారు? మీరు మీ ప్రియుని వద్దకు వెళ్లి మీకోరిక తీర్చుకొండి, నేను మీ ప్రవర్తనకు కోపగించలేదు, బాధపడటంలేదు, నేనెల్లప్పుడూ నాలో సంతృప్తిగా వున్నాను".

మదనిక అనబడే చూడాల యిలా అన్నది, "నేను శీలవతిని కాను. నేను అజ్ఞానిని. నా కామాన్ని అదుపులో పెట్టుకోలేను. స్త్రీకి సహజంగా పురుషుల కంటే పదిరెట్లు యెక్కువ కామం వుంటుంది, మగవాని బెదిరింపుకాని, నిషేధంకాని, సత్శీలం పట్ల గౌరవం కాని, స్త్రీ కామాతురతనదుపులో పెట్టలేవు. దయచేసి నన్ను క్షమించండి, క్షమాగుణమే పవిత్ర వ్యక్తుల ప్రధాన లక్షణము". శిఖిధ్వజుడిలా సమాధానము చెప్పాడు "ఓ మధురమైన మదనికా! వృక్షానికి, ఆకాశములో యెలా స్థానంలేదో, అలాగే ఆగ్రహానికి నా హృదయంలో ఆస్కారములేదు".

"చూడాల శిఖిధ్వజునింక యెక్కువ పరీక్ష చేయదలుచుకోలేదు, ఆమె తన భర్త ఆత్మ జ్ఞానసంపన్నుడై, సంపూర్తిగా కామ, క్రోధముల నుండి విముక్తుడయినాడని, గట్టి నమ్మకమేర్పడింది. ఆమె మదనిక శరీరాన్ని విడనాడి, తన సహజమైన చూడాల రూపాన్ని ధరించి, రాజుగారి ముందు ప్రత్యక్షమయింది. వెంటనే శిఖిధ్వజుడు "అమ్మా, మీరెవరు?" యని ప్రశ్నించాడు.

చూడాల యిలా సమాధానం చెప్పింది, నేను మీరు అగ్నిసాక్షిగా వివాహమాడిన మీ ధర్మపత్నిని. నా యోగశక్తితో నేను కుంభముని, మదనిక రూపాలను ధరించి,మీరు కైవల్య రహస్యాలు తెలుసుకొని, బ్రహ్మ జ్ఞానము పొందటానికి వుపదేశం చేశాను. మిమ్మల్ని

సక్రమ మార్గము నుండి మరలించటానికై యెన్నో ప్రయత్నాలు చేసాను, మిమ్మల్ననేక విధాలుగ పరీక్షించి, మీ జ్ఞానమెంత లోతుగ, ప్రగాఢంగా వుందో గ్రహించాను. ఇప్పుడు మీరు నిర్వికల్ప సమాధిలో ప్రవేశించి, అన్ని విషయాలు కూలంకషంగా తెలుసుకోండి".

శిఖిధ్వజుడు ధ్యానమునకై ఆశీనుడైనాడు, ఆ సమాధి స్థితిలో తను రాజ్యాన్ని వదలిపెట్టి వచ్చినప్పటి నుండి, యీనాడు చివరకు చూడాలను కలుసుకొనేంత వరకు జరిగిన సంఘటనలన్నీ వివరంగా చూచాడు.

చూడాల శిఖిధ్వజునితో యిలా అన్నది "హే ప్రభూ! మీకిప్పుడన్ని సందేహాలు తీరాయా? అజ్ఞానము వలన కలిగిన భ్రమ కూడ తొలగిపోయింది కదా? మీరు మీ స్వరూప స్థితిలోనే వున్నారు కదా? మీరు నిత్యానందముననుభవిస్తున్నారు కదా?"

శిఖిధ్వజుడిలా సమాధానము చెప్పాడు: నేనిప్పుడు సంపూర్తిగా అన్ని బాహ్యాకర్షణలు, తప్పులు, సందేహాలు, భ్రమల నుండి సంపూర్తిగా విముక్తడయినాను, నేనిప్పుడు ప్రశాంతంగా వున్నాను. నాకెలాంటి కోరికలులేవు, నేనెవరి దగ్గర నుండి, యేమీ ఆశించటము లేదు నాకిది కావాలని కోరుకోవటానికేమిలేదు, నేనిది కాదు, అదికాదు, ఏ విషయాన్ని లేక యే సంఘటనను గురించి నాకు బాధకాని, సంతోషం కాని లేదు. నేను నిరంతము నా పరమానందభరితమైన ఆత్మలో విశ్రమిస్తున్నాను. ఏది కూడ, నా శాంతిని భంగపరచలేదు, నేను ద్వంద్వముల నుండి, హెచ్చుతగ్గుల నుండి, విభేదాల నుండి సంపూర్తిగా స్వేచ్ఛను పొందాను. నేను వస్తువుల గురించి, విషయాల గురించి, ఆలోచించను. నేను సర్వ వ్యాపకమైన, స్వచ్ఛమైన తెలివిని (ఎరుకను). నేను సర్వత్రా గోచరించి, అన్ని వస్తువులనాక్రమించి, స్వచ్ఛతను కోల్పోని వుపరితల వాయువులాంటి వాడిని. చూడాల యిలా సంభాషించింది "ఓ ప్రభూ! మీరు మీరాచరిక విధులను మరల నిర్వర్తించండి. మీరు కర్మకు బంధితులుకారు".

శిఖిధ్వజుడంగీకరించాడు, అప్పుడు చూడాల అతని శిరస్సును నూనెతో మర్దన చేసి తిరిగి రాజుగా, అతనికి పట్టాభిషేకము చేసింది, ఆమె రాజుగార్ని రత్నభరితమైన, అందమైన సింహాసనముపై కూర్చుండబెట్టి, అతను దీర్ఘాయుష్మంతుడు కావాలని ఆశీర్వదించింది. అప్పుడు శిఖిధ్వజుడు, చూడాల చక్కగా అలంకరించిన గజేంద్రము నెక్కి యిరువైపుల సైన్యముతో వారి రాజనగరము ప్రవేశించారు. నృత్య, సంగీతాల మేళవింపుతో, నగర వీధులన్నీ కోలాహలంగా వున్నవి, రాజుగారు రాజభవనములో పరివారంతో ప్రవేశించి, అక్కడ మంత్రులు, రాజసభికులు, సేవకులందరూ స్వాగతం పలికారు. ఆయన అప్పటి నుండి వొక వెయ్యి సంవత్సరములు రాజ్యపరిపాలన చేసి, తరువాత తన భార్యతో కూడ విదేహ ముక్తిని పొందాడు.

- సశేషం

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

మే 2018

05 శని - వైశాఖ బహుళ పంచమి - శ్రీమహాకాళికా పరమేశ్వరీ సహిత రామలింగేశ్వరస్వామివారల ప్రతిష్ఠా మహోత్సవము, లీలా కళ్యాణము.

10 గురు - శ్రీ గురుదశమి - హనుమజ్జయంతి - సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ.

14 సోమ - మాస శివరాత్రి , పావులూరులో ఏకాహం.

15 మంగ - అమావాస్య.

23 బుధ - జేష్ఠ శుద్ధ నవమి - శ్రీ సుగుణ ప్రసాద మాతాజీ వారి ఏకాదశ వార్షికారాధన.

29 మంగ - పూర్ణిమ(అధిక జేష్ట పూర్ణిమ), శ్రీ సద్గురు పాదపూజ

జూన్ 2018

08 శుక్ర - శ్రీ గురు దశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ.

12 మంగ - మాస శివరాత్రి., పావులూరు శాఖలో ఏకాహం

13 బుధ - అమావాస్య.

28 గురు - పూర్ణిమ (నిజ జేష్ట పూర్ణిమ), శ్రీ సద్గురు పాదపూజ

## వేసవిలో శిక్షణా తరగతులు!

25-4-2018 నుండి 15-5-2018 వరకు శ్రీకాళీగార్డెన్స్ నంబూరులో చిన్నపిల్లలకు వేసవి శిక్షణా తరగతులు ప్రార్థన, భగవద్గీత, ఉపనిషత్తులు మొదలగు అంశాలలో నిర్వహింప బడుతున్నాయి. ఆసక్తి గల తల్లిదండ్రులు విషయాన్ని గమనించి సద్వినియోగ పరచుకోగరు!

వివరములకు డా.అరుణ. సెల్ నం. 9346382563

# పరిప్రశ్న

- పరాశర ప్రసాద్

'నేను రోజూ ప్రార్థనకు వెడుతున్నాను. ధ్యానం చేస్తున్నాను. కానీ నాలో ఏ మార్పు కనబడటం లేదు. నేను అనేక పాపాలు చేశాను. అవన్నీ ఎలా రహితమవుతాయి? నాకు గురుదేవుడి అనుగ్రహం కలుగుతుందా?' అని సద్గురుదేవులను ప్రశ్నించినవారు అనేకమంది.

అలాంటి భక్తులనుద్దేశించి మాట్లాడుతూ శ్రీగురుదేవులు "నువ్వు చేసే ప్రార్థన, ధ్యానము యొక్క అంతరార్థము ఏమిటి? వాటి



ధ్యేయము ఏమిటో, ఎందుకు ఆ క్రియలు ఆచరిస్తున్నావో ఎన్నడైనా విచారణ చేశావా? సత్యం అనేది మనస్సులోనే అంతర్గతంగా వుంది. అంటే ఒక ప్రదేశానికి పరిమితమై లేదు. 'అణోరణీయాన్ మహతో మహీయాన్' అన్నట్లుగా అణువణువునా సర్వవ్యాపకంగా, సూక్ష్మంగా మహత్తరంగా వ్యాప్తమై వున్నది. దానిని గుర్తించ గలిగితే చాలు. వాల్మీకి బోయవాడు. ఎన్నో దుష్కార్యాలు చేశాడు. ఎంతో మందిని హింసించాడు. ఆభరణాలు దోచుకున్నాడు. కాని చివరకు నారద మహర్షి ఉపదేశించిన 'రామ' అన్న నామంతో మహా పురుషుడయ్యాడు. రామాయణ మహా కావ్యాన్ని రచించాడు. అందువల్ల ప్రతివారూ నేను మూర్ఖుడను, నేను దుష్టుడను, ఎన్నో పాపాలు చేశాను అని ఎవరికి వారు చిన్నబుచ్చుకోకూడదు. నీ స్థానం చాలా గొప్పది. ఎన్నో జన్మల పుణ్యం రాశీభూతమై మానవజన్మ సంప్రాప్తించింది. అంతేకాదు నీ నడక సత్య మార్గంలోనే ఉంది. ధ్యానం చేస్తున్నావు. ప్రతిరోజూ ప్రార్థనలో పాల్గొంటున్నావు. అయితే జన్మజన్మల నుండి సంక్రమించిన వాసనలతో అవిద్య లేక అజ్ఞానంలో పడి నీ ఆలోచనా విధానం సక్రమ మార్గంలో లేదు.

పరమాత్మ వస్తువు అంతటా ప్రకాశిస్తోంది. నువ్వు నమ్మిన భగవానుడు నిన్ను తప్పక అనుగ్రహిస్తాడు. నిన్ను సక్రమమైన మార్గంలో నడిపిస్తాడు. అయితే నీ సాధన పరిపక్వమవటానికి నువ్వు ఒక సమర్థుడైన గురుదేవుని ఆశ్రయించాలి. మీలో ఆవేదన, భక్తి లోపించి

నట్లయితే ప్రార్థన, ధ్యానంలో పాల్గొనలేరు. పాలు తోడుకునే వరకు కదప కూడదు. తోడుకున్న తరువాత ఎంత కదిపినా ఫరవాలేదు. అందువల్ల మీరు ఈ దేవత కాదని ఆ దేవత, ఆ దేవత కాదని మరో దేవత చుట్టూ తిరిగి అంతులేని సంకల్పాలతో కాలాన్ని వృథా చేసుకోకండి. మీరు నమ్మిన ఒకే ఒక దేవతా మూర్తిని ఆరాధించండి. ఆశ్రయించండి. ఆ దేవత అనుగ్రహంతో సద్గురుమూర్తి సమాశ్రయం లభిస్తుంది.

మనం ప్రాపంచికంగా ఏదైనా నేర్చుకోవాలంటేనే మనకి బోధన చేయటానికి గురువు కావాలి. అలాగే ఆధ్యాత్మిక సాధనలో కూడా గురువు అవసరం. మీ దగ్గర డాలర్లు ఉన్నాయనుకోండి. మాల్స్‌లో రకరకాల వస్తువులు వున్నాయి. అయితే మీరు ఏ ప్రయత్నం చేయకుండా ఆ వస్తువులు మీ యింటికి చేరవు కదా! కాబట్టి తగు ప్రయత్నం చేసి ఆ వస్తువులు కొనితెచ్చుకుని వండుకుంటే మీకు భుజించటానికి పదార్థం ఉంటుంది. అలాగే నాకు భగవదనుగ్రహం లేదు. నాకు గురువు దొరకలేదు. నేను గురువును ఎలా వెతకాలి? నాకు గురువు దొరుకుతాడా? అనే సందేహాలన్నిటికీ సమాధానం మీలో వున్న విశ్వాస లోపమే! ముందుగా విశ్వాసాన్ని పెంపొందించుకోండి. భగవంతుడు వున్నాడని విశ్వసించండి. ఆశ్రయించండి. భగవంతుడి సేవలో పాల్గొనండి. ఆరాధించండి. తప్పక భగవంతుని అనుగ్రహాన్ని పొందగలుగుతారు. భగవంతుడు మనందరి ప్రభువు. మన రక్షకుడు.

## పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు

మే 2018

10 గురువారం -శ్రీగురుదశమి- హనుమజ్జయంతి - ఉ॥ 10గం.లకు ఆకుపూజ; శ్రీ సద్గురు పాద పూజ, భక్త సమారాధన.

29 మంగళవారం - అధిక జేష్ఠ పూర్ణిమ - రాత్రి 7గం. శ్రీసద్గురుపాదపూజ.

జూన్ 2018

08 శుక్రవారం - శ్రీగురుదశమి, రాత్రి 7గం.లకు శ్రీసద్గురుపాదపూజ.

28 గురువారం - నిజ జేష్ఠ పౌర్ణమి, రాత్రి 7గం.లకు శ్రీ సద్గురు పాద పూజ.

శుభాభినందనలతో ...


**Grand**

R A D I A T O R S

**AN ISO 9001:2008 CERTIFIED COMPANY**

Manufactures of Radiators (Automobile and Industrial), Oil Coolers, Air Coolers, After Coolers, Inter Coolers, Finned Tube Coolers, Shell and Tube Heat Exchngers,Tube Bundles,Condernsers,Cooling Coils,All Pre-Heaters, Large After Coolers and Mechanically Bonded Radiators









# GRAND RADIATORS

PLOT NO 131, BLOCK – D, AUTONAGAR,
VISAKHAPATNM -530012 AP, INDIA
TELPHONE: 0891-2517706, 2564538, FAX NO. 0891-2513660, 2502640
E-mail: grandradiator@yahoo.in Website: www.grandradiators.com

# శ్రీ కృష్ణ కర్ణామృతము

- సుశీలా ప్రసాద

**ద్వితీయాశ్వాసము - 60 వ శ్లో॥**

**మాతః కిల యదునాథ దేహి చషకం కిం తేన**

**స్తన్నాస్త్వద్య కదాస్తి వా నిశి నిశావా వాన్ధ కారో దయః**

**అమిల్యాక్షి యుగం నిశాప్యుపగతా దేహితి మాతుర్ముహు**

**ర్వక్షో జాంశు కర్షణోద్యత కరః కృష్ణ స్స పుష్ణాతు నః ॥**

తాత్పర్యము -



కృష్ణుడు - ఓ యమ్మా!

యశోద - ఓ యాదవ రాజా! యేమిరా?

కృ - నా పాల పాత్రను తెమ్ము.

య - దానితో నేమి పనిరా?

కృ - పాలను త్రాగుటకు.

య - ఆ పాలు ఇప్పుడు లేవు.

కృ - మరి ఎప్పుడు ఉండును?

య - రాత్రి యందు వుండును.

కృ - రాత్రి యనగా నేమి?

య - చీకటి పడుట.

కృ - (రెండు కన్నులు గట్టిగా మూసుకుని) రాత్రి వచ్చినది. పాలపాత్రను తెమ్ము - అని తల్లి కొంగును లాగుటకై చాచబడిన చేయిగల ఆ చిన్ని కృష్ణుడు మమ్ము బ్రోచును గాక!!

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, ఆశ్రమ స్థిర నివాసులు అయిన శ్రీ పాలూరి వెంకట రమణగారు 19-4-2018 గురువారం నాడు శ్రీ సద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 87సంవత్సరాలు. సద్గురు దేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక!

వీరి కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# పల్లమెరుగని నీరు

- పాలూరి కాశీప్రసాద్

ఒక రోజు నేను కారు నడుపుతుండగా ఒక వంతెన పైనుండి కాసిని నీళ్ళు ముందు వుండే అద్దం మీద పడ్డాయి. ఏటవాలుగా వుండే అద్దం మీద మామూలుగా నీళ్ళుపడితే అవి భూమ్యాకర్షణ శక్తికి లోబడి క్రిందికే జారిపోవాలి కదా! కానీ కారు వేగానికి వుత్పన్నమైన ఎదురు గాలికి ఒక చుక్క నీరు కూడా క్రిందికి జారకుండా, మొత్తం పైకి ప్రవహించింది.

మన మనస్సు కూడా ఆ నీరు లాంటిదే. ఎప్పుడూ ప్రాపంచిక ఆకర్షణలకు లోబడి నీచ భావాల దిశగా జారిపోతూ వుంటుంది. కానీ, అదే మనస్సుకు వేగంగా, మరియు నిరంతరంగా జరిగే భగవన్నామ జపాన్ని తోడు చేసినప్పుడు, అది ఆ ఆకర్షణకు వ్యతిరేక దిశలో, పరమాత్మకు అభిముఖంగా, ఆధ్యాత్మిక ఉన్నతి దిశగా ప్రయాణం చేయ గల శక్తిని సంతరించుకుంటుంది.

ఇక్కడ వేగాంగా జపం చేయటమంటే మనం పలికే నామం మనకే అర్థమవనంత హడావిడిగా చేయమని కాదు. నామానికి నామానికి మధ్య సంకల్పం దూరే సందు యివ్వకుండా అని అర్థం. శ్రీ బాబూజీ మహరాజ్‌వారు దీనికే రెండు ఉదాహరణలు చెప్పేవారు...

1. ఫ్యాన్ వేగంగా తిరిగినప్పుడు దాని మూడు రెక్కలూ కలిసిపోయి ఒక్కటిగా ఎలా గోచరిస్తాయో, అలాగే భగవన్నామం వేగంగా జపించినప్పుడు మన మూడు గుణాలూ లయమైపోయి శుద్ధసత్వ గుణంగా భాసిస్తాయి.

2. జనరేటర్ వేగంగా తిరిగినప్పుడు విద్యుచ్ఛక్తి ఎలా వుత్పన్నమవుతుందో, అలాగే నామజపం వలన మనలో ఆధ్యాత్మిక శక్తి ఉత్పన్నమవుతుంది.

# జెన్ స్టోరీ

- రమణ ప్రసాద్

"జెన్" అనే "బుద్ధిజమ్" యొక్క శాఖ ఆరవ శతాబ్దిలో చైనాకు విస్తరించింది. వారు అందించిన ఉపదేశాలు సంచలనాత్మకంగా విచారాత్మకంగా ఉన్నా కొన్ని అర్థంలేనివిగా, అసంబద్ధంగా కనిపిస్తాయి. జెన్ మాస్టర్లు వాటిని వివరించే ప్రయత్నం ఏమీ చేయరు. విచారణ చేస్తే వాటిలోని లోతైన భావాలు అవగతమవుతాయి.

**"Before enlightenment, chop the wood, carry water. After enlightenment, chop wood, carry water." –**

"జ్ఞాని అయేముందు, కట్టెలను కొట్టు, నీళ్ళను తీసుకొనిరా! జ్ఞానివి అయ్యాక, కట్టెలను కొట్టు. నీళ్ళను తీసుకొని రా!"

సాధారణంగా మనం చేసే ప్రతి పనికీ ఫలాన్ని ఆకాంక్షిస్తాము. మనం చేసే విధానంలో మార్పులు చేర్పులు చేసి చివరికి సత్ఫలితం లభిస్తే మనకి ఎంతో గర్వం కలుగకమానదు. కాని గమ్యం చేరటానికి గాని, జీవితంలో ముందడుగు వేయటానికి గాని నువ్వు చేసే పనిలో మార్పు ఉండదు. ఉండబోదు. నిన్ను నీవు తెలుసుకొనే మార్గంలో నువ్వు చేరాల్సిన చివరి అంచు అది కాదు. నువ్వు చేసే పని చేస్తూ ఉండాలి. చేస్తూనే ఉండాలి. జెన్ ఏమి చెప్తుంది అంటే, "నువ్వు ఒక పని చేస్తున్నావు. ఆ విధంగానే పనులు చేస్తూ పో. నువ్వు నమ్మినా సరే నమ్మకపోయినా సరే నువ్వు చేయాల్సింది ఇదే. అదే "వర్తమాన స్థితిలో" ఉండటం.

మనం వర్తమాన స్థితిలో ఉన్నప్పుడు గడియారంలో టైమ్ ఎంతైంది? అని చూడం. ఏ పనైనా గానీ. నీ సర్వశక్తులను వుపయోగించి సమర్థవంతంగా చెయ్యి. అప్పుడు నువ్వు చేసేది నీకు భారంగా తోచదు. 'కట్టెలు కొడతావు. నీళ్ళు తెస్తావు. జీవితం సాగిపోతుంది.'

పని ఎంత అల్పంగా తోచినా సరే వర్తమాన స్థితిలో ఉండి, నీ బుద్ధిని కేంద్రీకరించి చేస్తే, అది గొప్ప ఫలితాన్ని ఇస్తుంది. నువ్వు జ్ఞానిగా ప్రకాశిస్తావు. నువ్వు కట్టెలను కొడుతూనే వుంటావు. నీళ్ళు తెస్తూనే వుంటావు. నీ పనిని నువ్వు చెయ్యి. బాగా చెయ్యి. నీకు విజయం లభిస్తుంది. నీ కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూనే ఉండు.

**"Sitting quitely, doing nothing, spring comes,and grass grows by itself."**

"ఊరికే కూర్చో. ఏమీ చేయకు. వసంతం వస్తుంది. గడ్డి దానంతట అదే చిగురిస్తుంది." ఇది వింతగా అనిపిస్తుంది. కాని ఒక్కోసారి ఏమీ చేయకపోవటమే మంచిది. మనం పరుగిడే జీవితాలలో మనం ఎంతో

సాధించాలని చూస్తాం. మనం ఆగితే ప్రపంచమే ఆగిపోయిందని భావిస్తాం. నీ ప్రయత్నం లేకపోయినా ప్రపంచం యొక్క గతి ఆగదు. నువ్వు లేకపోయినా ఆగదు. కాబట్టి ఆ పరిస్థితులలో ఏలా మెలగాలో ఆలోచించు. అలసిపోయావా? ఏమీ చేయకు. అయ్యో! అని తల బాదుకోకు. నువ్వు శక్తిమంతుడవై నీ పనిని బాగా నిర్వర్తిస్తావు. జరిగేదానిని ఆపకు. ఆలా చేస్తే శాంతి లభిస్తుంది. శాంతి పొందినకొలదీ నువ్వు అంతర్ముఖుడవు అవుతావు. ఏమీ చేయకపోవటం నీ పురోగతికి దారి తీస్తుంది.

**"If you walk, just walk. If you sit, just sit; but whatever you do, don't wobble."** -"నువ్వు నడవాలనుకుంటే నడు. కూర్చోవాలనుకుంటే కూర్చో. కాని ఎప్పుడూ వెనకంజ వేయకు."

ఇది చెయ్యాలి అది చెయ్యాలని ఆలోచిస్తావు. నేనే ఈ పని చెయ్యగలను. నా వల్లనే ఇది అవుతుంది అనుకొంటావు. ఇంతలో మరణం సంభవిస్తే, ఇంకొకరు నీ పనిని చేస్తారు. పని ఆగిపోదు. రోజు రోజుకూ మారుతున్న పరిస్థితులలో మనం ఏ ఒక్కదానిపై కేంద్రీకరించలేకుండా ఉన్నప్పుడు నువ్వు ఏది చెయ్యాలనుకొంటే అది చెయ్యి. నీ మనస్సును భూత, వర్తమానాలనుండి మరల్చుకో. ప్రస్తుతం ఏది చేయాలో ఆలోచించు. మునిలాగా ప్రవర్తించు. ఏది చేయాలనుకున్నావో అది చెయ్యి.

**"When hungry, eat your rice; When tired close your eyes. Fools may laugh at me, but wisemen will know what I mean."** - ఆకలిగా ఉంటే అన్నం తిను; అలిసిపోతే కళ్ళు మూసుకో. అవివేకులు నన్ను చూసి నవ్వుతారు. కాని వివేకవంతులు నా మాటలను అర్థం చేసుకొంటారు."

ఈ సూక్తి చాలా సరళం అనిపించవచ్చు. కాని ఎంతో అర్థవంతమైనది. ఈ విషయాదులతో నిండిన ప్రపంచంలో,మనం తీసుకొనే ఆహారం, మనం చేసే పని,మనం నడిచే విధానం, మనకి ఒక శిక్షణను ఇస్తాయి. ఆకలివేస్తే అన్నం తిన్నట్లుగా నువ్వు చేస్తున్న పనిని పూర్తి చెయ్యి. అలసిపోతే విశ్రాంతి తీసుకో. ఆగు! ఇప్పుడు ఆలోచించు. నీకు ఆకలి ఎందుకు వేసిందో, నువ్వు ఎందుకు అలసిపోయావో. అప్పుడు నువ్వు చేయాలనుకొన్నది సరిగ్గా చేయగలుగుతావు.

(గత సంచిక తరువాయి) # కైవల్యోపనిషత్ - రేఖ

ఉపనిషత్ అన్నమాటకు రకరకాలుగా అర్థాలు చెప్పినా మనకు అందుబాటులో చెప్పినదేమిటంటే ఉప : సమీపంలో, (మహాత్ముల సన్నిధిలో), ని : క్రింద, షద్ : ఆసనం కలిగి వుండటం.

ఉపనిషత్‌కీ ఉపాసనకీ దగ్గర సంబంధం వున్నది. ఉపనిష ద్విచారణ అంటే ఏదో గబగబ చేసి వెళ్ళిపోయేది కాదు. క్షేత్ర దర్శనం యాత్రలో ఒక అంతర్భాగం. క్షేత్రానికి వెళ్ళినప్పుడు ఆ క్షేత్రజ్ఞుణ్ణి దర్శించాలి. అంటే అక్కడ చైతన్య రూపంలో ప్రకాశిస్తున్న శక్తిని అనుభవించాలి. అంటే మనలో అంతటి ఉపాసన ఉండాలి. ఒక గురు సాంప్రదాయంలోకి వచ్చి, గురువు యొక్క అనుగ్రహం పొంది ఉపాసన చేయాలి. ఉపాసన తీసుకుని చేసిన యాత్రకు, ఉపాసన లేకుండా చేసిన యాత్రకు తేడా వుంటుంది. ఉపాసన తీసుకున్నాము అంటే మనస్సు మీద ముద్ర వేస్తారు గురుదేవులు. ఎందుకంటే ఇక్కడ మారాల్సింది మనస్సు. ప్రవృత్తిలో మార్పు రావాలి. అటువంటి మార్పుని తీసుకువచ్చేవారు శ్రీగురుదేవులు మాత్రమే.

శ్రీగురుదేవులు చేసిన ఉపదేశం ఒక కవచంలాగా పనిచేస్తుంది. ఎక్కడ వున్నా, ఎక్కడికి వెళ్ళినా కూడా 'నేను ఉన్నాను' అని శ్రీగురుదేవులు హెచ్చరిక చేస్తూ వుంటారు. 'నేను ఉన్నాను' అంటే బయట కనబడేది కాదు. చైతన్య రూపంలో మనకు గురువులు హెచ్చరిక చేస్తూ వుంటారు. అప్పుడు మనం నిర్భయత్వంతో ఎక్కడకు వెళ్ళినా మన సాధనలో మంచి అనుభవాన్ని సిద్ధింపజేసుకుంటాము - ఇది నా స్వానుభవం అని శ్రీ మాతాజీ చెప్పారు.

ఉపనిషత్తులు వేదాలలో నుండి వచ్చాయి. ఇప్పుడు మనకు 108 ఉపనిషత్తులు లభ్యమవుతున్నాయి. వాటిల్లో 10 ఉపనిషత్తులు ముఖ్యమైనవి. అయితే ఈ దశోపనిషత్తుల్లో కైవల్యోపనిషత్ కనబడదు. కానీ దశ ఉపనిషత్తుల్లోనూ అంతర్లీనంగా కనిపించేది కైవల్యమే. అది బయటకి కనిపించేది కాదు. తియ్యటి పదార్థం తినివచ్చినప్పుడు చాలా బాగుంది, తియ్యగా వుంది అని చెప్పగలడు. తిననివాడు చెప్పలేడు. వాడు కూడా తింటే తెలుస్తుంది దాని మాధుర్యం ఏమిటో. మనం గురువుని ఆశ్రయించి ఉపాసన చేస్తే మనం పొందినటువంటి స్థితిని

మన మనస్సు చెబుతుంది. అటువంటి ముక్త స్థితిని మనమందరమూ పొంది వున్నాము కూడా. కాకపోతే ఆ స్థితిని గుర్తించి, ఆ స్థితిలోనే నిలబడి వుండాలి.

-సశేషం

**విజయనగరం జిల్లా, రామభద్రపురం అగ్రహారం,**
**శ్రీశ్రీశ్రీ ఉమా వీరేశ్వరస్వామి ఆశ్రమం వ్యవస్థాపకులు**
**శ్రీ సాయినాన్నగారు సుమారు 180 దేవాలయాలను పునః ప్రతిష్ఠ చేయించారు.**
**2018 లో జరుపబోయే కార్యక్రమాలు**
**మే 7, 8, 9 సీతమ్మపేట శివాలయం ప్రతిష్ఠ [ఎస్.కోట మం.]**
**10-5-18 - కాజాపేట పోతలవాని కాలాలు వార్షికోత్సవము**
**7-7-2018 - మండలం, పిల్ల అగ్రహారంలోని శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామివారి వార్షికోత్సవం.**




శ్రీకాళీ ప్రసాద స్వచ్ఛంద సేవాసంస్థ వారిచే కర్నూలు నందు డా॥ సి.బి. హరినాధ రెడ్డి కమీషనర్ కర్నూలు నగర పాలికగారిచే 31 మార్చిన,చలివేంద్రం ప్రారంభింపబడిన దృశ్యం.

శుభాభినందనలతో ...



VennTech
Manufacturer of
Ventilation System /
Air Handling Equipments
for Marine applications
PRODUCTS :
Blowers
ATU'S
Coolers
Moisture Separaters
Heat Exchangers
PLOT NO: 1-125/17/A, MIE, HAFEEZPET, MIYAPUR, HYDERABAD – 500 049.
MOBILE: 9000410044, TEL : 040 – 64100589, FAX:040-23116650
E-MAIL: VENNTEC@GMAIL.COM

# సమర్థ సద్గురు నాధుని దివ్య చరిత్ర

## భీమవరం తాతయ్యగారితో శ్రీబాబు

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్

శ్రీ బాబు చిరునవ్వుతో వారి భుజం తడుతూ “మీరు కోరిన యీ కోరికలోనే మీ ఉత్తమ సంస్కారం వెల్లడి అవుతున్నది. జీవనాధారంగానే మానవుడు వృత్తిని స్వీకరిస్తాడు. కాని వివేకం గలవాడు ఆ వృత్తి ధర్మాన్నే ఒక సాధనగా మలచుకొని, యిటు యిహంలోను, అటు పరం లోను ధన్యుడౌవుతాడు. నిస్వార్థంతో మీరు ఏ సేవ చేసినా, ఆ రూపంలో భగవంతుడే ఆ సేవను అందుకుంటాడు. ఓపికున్నంత సేవను మీరు చేసుకుంటే, మోయలేనంత భాగ్యాన్ని ఆ ప్రభువు మీకు ప్రసాదిస్తాడు. అఖండ భోగ భాగ్యములను, పుత్ర పౌత్ర ధన ధాన్యములను భగవానుడు మీకు ప్రసాదించుగాక!” అని ఆశీర్వదించారు.



ఆ డాక్టరు రైలు కదిలే వరకు శ్రీబాబు సన్నిధిలోనే ఉండి, ఆనంద బాష్పాలతో సెలవు తీసుకున్నాడు. పరిచయం క్షణికమే అయినా, ఫలితాన్ని అపరిమితంగా ప్రసాదించే పరమ కారుణ్యమూర్తులు గురుదేవులు. తుమ్మెదకు పుష్పంతో పరిచయం క్షణికమే. కాని అది అందుకునే మధువు, ఆ తుమ్మెద ఆస్వాదించగా యింకా ఎందరికో పంచి పెట్టటానికి సరిపడేదిగా వుంటుంది.

బదరీనాథ్ వెళ్ళినప్పుడు యాత్రికులు బ్రహ్మకపాలం వెళ్ళి స్వర్గస్థులైన తమ పితృదేవతలకు పిండ ప్రదానాలు చేస్తారు. శ్రీబాబుతో వెళ్ళిన భక్తులలో కొందరు బ్రహ్మ కపాలం వెళ్ళినప్పుడు అక్కడ పిండ ప్రదానాలు చేస్తున్నారు. తాతయ్యగారు కూడా అలా చేద్దామని బయల్దేరుతూ శ్రీబాబు అనుమతిని కోరారు. శ్రీబాబు తాతయ్యా! నీవంటి కర్మయోగి జన్మించిన వంశంలో యిటు ఏడు తరాలు, అటు ఏడు తరాల వారు తరిస్తారయ్యా! ఇక వాళ్ళకు యీ పిండ ప్రదానాలతో

పనిలేదు" అన్నారు. కాని తాతయ్యగారి మనస్సు సమాధాన పడలేదు.

అప్పుడు శ్రీబాబు ఆ పిండ ప్రదానాలు చేయించే బ్రాహ్మణ్ణి పిలిపించి "ఇలా చేసే పిండ ప్రదానాలు పితృదేవతలకు చెందుతున్నట్లు మీరు చెప్పగలరా?" అని ఆ బ్రాహ్మణ్ణి తాతయ్యగారితో అడిగించారు. ఆ బ్రాహ్మణుడు బిత్తరపోతూ "సాంప్రదాయ సిద్ధంగా వస్తున్న యీ ఆచారాన్ని వృత్తిగా గుర్తిస్తున్నామే గాని, యివి పితృ దేవతలకు ముడుతున్నాయో లేదో మేము చెప్పలేము" అన్నాడు.

బదరీనాథ్‌లోనే ఉన్న ఒక సాధువు వద్దకు తాతయ్యగారిని పంపించి, శ్రీబాబు యీ ప్రశ్ననే ఆయనను అడగమన్నారు. ఆ సాధువు "మొక్కుబడి కోసం మీరు చేస్తూ, ధనార్జన కోసం ఆ పురోహితుడు చేయిస్తూ ఉన్న యీ పిండ ప్రదానానికే కాదు, ఏ కర్మకాండకైనా ఫలితం శూన్యం. చిత్త శుద్ధితో చేసిన కర్మలకే సత్ఫలితాలు కలుగుతాయి" అన్నాడు.

శ్రీబాబు దానిని వివరిస్తూ "పరలోకాలలో ఉన్న పితృదేవతలకు యీ పిండ ప్రదానాల వలన ఫలితం లభించాలంటే, చేసేవారూ చేయించేవారూ కూడా ఎంతో శ్రద్ధా భక్తులతో, నియమ నిష్ఠలతో సదాచార పరులై ఉండాలి. అలా సదాచారపరులై ఆచరించినా, కలిగే ఫలితం, ఆ పితృదేవతలకు ఆహారం లభిస్తుందనే కాని, ఉత్తమ గతులు కలుగవు. అదే భక్తి శ్రద్ధలతో, నియమ నిష్ఠలతో సదాచార పరుడైన మానవుడు, జీవేశ్వరుడైన ఆ పరమేశ్వరుని నిష్కామ బుద్ధితో ఆరాధించి, ధ్యానించి ఆ ప్రభువు అనుగ్రహాన్ని పొంద గలిగితే, అతనితో బాటు అతని పితృదేవతలకు కూడా ఉత్తమ గతులు కలుగుతాయని, ఆ వేదాలూ, ఆ ఉపనిషత్తులే చెబుతున్నాయి. మరి మీరు యీ రెండింటిలో ఏ మార్గాన్ని కోరుకుంటారు?" అని తాతయ్యగారిని అడిగారు.

తాతయ్యగారు"సాక్షాత్ పరమేశ్వరులైన మీ పాదపద్మాలను ఆశ్రయించిన నాకు యిక ఎటువంటి సందేహాలూ లేవు. ఏ కర్తవ్యమూ లేదు బాబూ! మీరు చూపిన బాటలో నడుచుకోవటమే నా ఏకైక లక్ష్యము" అన్నారు.

-సశేషం

విష్ణు  కథలు

- రమణ ప్రసాద్

# శ్రీరామకృష్ణ పరమహంస

## సాధనదశ: శ్రీరామకృష్ణుడి వ్యక్తిత్వం:

1855వ సంవత్సరంలో రాణీ రాసమణి నిర్మించిన కాళికాలయం శ్రీ రామకృష్ణుల అఖండ వ్యక్తిత్వ విజృంభణానికి అనువైన వాతావరణాన్ని కల్పించింది. కాళికాలయానికి ప్రధానార్చకుడై అతడు నిర్వహిస్తున్న పూజావిధులు అతడి అంతరంగంలో భక్తి నిలదొక్కుకుపోయి బాహ్య లోకాన్నే మరచి గాఢ ధ్యానంలో, దివ్య సంకీర్తనలో గంటలు గడిపేవాడు. రాత్రులలో సమీపంలో ఉన్న అడవిలోకి వెళ్ళి కట్టుబట్టను, జంధ్యాన్ని విడచి దీర్ఘకాలం ధ్యానంలో గడిపేవాడు.



శ్రీరామకృష్ణులకు సన్నిహితుడైన హృదీరాముడది చూసి రాళ్ళు రువ్వి నిరోధించాలని చూశాడు. కాని బాహ్య స్మృతి లేకుండా ఉన్న రామకృష్ణులను భగవధ్యానం నుంచి బయటకు తీసుకు రాలేక పోయాడు. పూజావిధానంలో బాహ్యాచారాలు పాటించక అపూర్వరీతిలో దేవిని అర్చించసాగాడు.

శ్రీరామకృష్ణుల అంతరంగంలో భగవత్పరితాపం అనే బడబానలం చెలరేగుతోంది. తాను అర్చించే కాళికాదేవి కేవలం నిర్జీవ శిలా విగ్రహమా? లేక సృష్టిస్థితిలయకారిణి అయిన సాక్షాత్తు పరమేశ్వరియేనా? అయితే మరి దివ్యమాత తనకెందుకు దర్శనమివ్వదు? సాక్షాత్కారం లేని జీవితం దుర్భరంగా అయింది. అతడు ఇలా ప్రార్థించసాగాడు. "తల్లీ! ఒకరోజు గడచి పోయింది. నాకింకా నువ్వు ప్రసన్నవుకాలేదు. అమ్మా! ఆనందమయీ! అమ్మా! నీ కృపా కటాక్ష వీక్షణం నాపై పరపి నువ్వు నాకు సాక్షాత్కరించక తప్పదు" తీవ్ర భగవద్విరహ వేదనచే ముఖం నేలకేసి రాసుకోగా, గాయాలై నెత్తురు కారేది. హృదయం రంపంతో కోసినట్లు బాధ కలుగగా నేలమీదపడి పొర్లాడుతూ అతడు పడే ఆవేదన

కాంచిన జనం 'అయ్యో!పాపం! ఇతగాడేదో శూలనెప్పులతో బాధపడుతున్నాడేమో, లేక మాతృవియోగం వల్ల దుఃఖిస్తున్నాడేమో" అని జాలి పడేవారు. హతాశుడై, తన జీవితాన్ని అంతం చేసుకొనటానికి ప్రయత్నిస్తుంటే అకస్మాత్తుగా సాక్షాత్కారం అయింది. "దేదీప్యమానమైన అనంత చైతన్య సాగర రూపంలో దైవాన్ని గాంచి అతడు సమాధిమగ్నుడైనాడు.

కాని అతడు నిరంతర బ్రహ్మానుభూతి కోసం మధనపడసాగాడు. సర్వకాల సర్వావస్థలలోను, సమస్త ప్రదేశాలలోను బ్రహ్మానుభూతి పొందటానికై అతడు బాష్పధారలు ప్రవహించేటట్లు వెక్కి వెక్కి ఏడుస్తూ మునుపటికంటే ఎక్కువ తీవ్ర పరితాపంతో దివ్యజననిని ప్రార్థించసాగాడు. అతడికి బాహ్యలోక స్ఫురణ ఉండేదికాదు. ఒకవేళ స్ఫురించినా అంతా మిధ్యగాతోచేది. చివరకు అతడికి ఆలయంలో అర్చించటం అసాధ్యమై పోయినది. ఆలయ నిర్వాహకుడూ రాణి రాసమణి అల్లుడూ అయిన మధురనాధుడు శ్రీ రామకృష్ణుని పరిస్థితిని చూసి అతడిని పూజావిధుల నుండి విశ్రాంతింపచేసి, అతని సాధనకు తగిన సమస్త సదుపాయాలూ సమకూర్చాడు. శ్రీరామకృష్ణుడు లోకాతీతమైన భగవత్పరి తాపంతో, ధ్యాన, సాధనలలో మునిగిపోయాడు.

తాను పొందిన అఖండపరితాపాన్ని గురించి కాలాంతరంలో అతడు "మానవుడిని నీట ముంచితే ఎలా ఉక్కిరిబిక్కిరి అయి ఎలా గిజగిజ లాడతాడో, భగవత్సాక్షాత్కారానికై అలాంటి వేదనను అనుభవించాను" అని శిష్యులకు తెలిపి ఉన్నాడు.

-సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL